తెలుగు దినపత్రిక

సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

30-09-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 232

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575



రూ.2,700 మందుకు రూ.27 వేలా?

- క్యాన్సర్ మందుల ధరలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం
- రిటైలర్ ధరకు, ఎంఆర్‌పీకి పది రెట్ల వ్యత్యాసంపై ప్రశ్న
- సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలంటున్న ఆసుపత్రులపై ఆరా
- అక్టోబర్ 12కి తదుపరి విచారణ


8



రేషన్ కార్డులపై కేంద్రం కీలక నిర్ణయం

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని 1.58 కోట్ల మంది గుర్తింపు
- అక్టోబర్ 1 నుంచి కార్డుల ప్రయోజనాలు తాత్కాలికంగా నిలిపివేత


8



సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళికలను సిద్ధం చేయాలి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్
- భవిష్యత్ విద్యుత్ అవసరాలు, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకోవాలి

8



11 కేవీ హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు ఏకరీతి ఛార్జీలు!

వినియోగదారులకు పారదర్శక సేవలు

టీజీఈఆర్‌సీ నిర్ణయంపై ప్రభుత్వ హర్షం

రెగ్యులేషన్ పేరిట మూడవ సవరణ ఉత్తర్వులు జారీ చేసిన టీజీఈఆర్‌సీ

ప్రతి కేవీఏ కాంట్రాక్టెడ్ డిమాండ్‌కు రూ.4,078 సర్వీస్ లైన్ ఛార్జీగా నిర్ణయం

1 కిలోమీటర్ పరిధిలోని ఓవర్‌హెడ్ సరఫరా కనెక్షన్లకు వర్తింపు

కేసుల వారీ అంచనాల అవసరం లేకుండా ముందస్తు వ్యయ స్పష్టత

దరఖాస్తుల పరిశీలన, అప్రూవల్స్‌లో అనవసర జాప్యానికి ఇక చెక్

పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ, డేటా సెంటర్ల రంగాలకు భారీ ఊరట

వినియోగదారుల సౌలభ్యమే లక్ష్యంగా మరో విప్లవాత్మక సంస్కరణ

తెలంగాణ బ్యూరో (సెప్టెంబర్ 29), సిరి న్యూస్:

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పారిశ్రామిక, వాణిజ్య వర్గాలకు తీపి కబురు అందించింది. 11 కేవీ స్థాయిలో అర్హత కలిగిన హై టెన్షన్ నూతన విద్యుత్ కనెక్షన్లు, అదనపు లోడ్ల మంజూరుకు సంబంధించి ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీలను అమలు చేస్తూ మంగళవారం చారిత్రక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ సరఫరా లైసెన్స్ నిబంధనలకు మూడో సవరణ చేస్తూ రెగ్యులేషన్ నం. 07 ఆఫ్ 2026ను అధికారికంగా గెజిట్ రూపంలో జారీ చేసింది. ఈ నూతన సవరణ ద్వారా అర్హత కలిగిన 11 కేవీ హెచ్‌టీ వినియోగదారులకు సర్వీస్ లైన్ ఛార్జీల విషయంలో పారదర్శకమైన, స్పష్టమైన మరియు ఏకరీతి విధానం అందుబాటులోకి వచ్చింది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఈ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు సంపూర్ణ సంతృప్తి వ్యక్తం చేస్తూ స్వాగతించాయి.

మిగతా 2వ పేజీలో..

టీజీఎస్పీడీసీఎల్ చరిత్రలోనే సరికొత్త రికార్డు..



- అత్యధికంగా 12,044 మెగావాట్ల విద్యుత్ వినియోగం
- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీరుస్తున్న డిస్కం
- సెప్టెంబర్ 29న నమోదైన ఆల్ టైమ్ గరిష్ట డిమాండ్
- గతంలో నమోదైన 11,828 మెగావాట్ల రికార్డును అధిగమించిన వైనం
- నిరంతరాయ సరఫరాకు ముందస్తు ప్రణాళికలు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ డిమాండ్ కొత్త గరిష్ట స్థాయికి చేరుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం మధ్యాహ్నం 3:52 గంటలకు ఏకంగా 12,044 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. సంస్థ చరిత్రలో ఇదే అత్యధిక విద్యుత్ డిమాండ్ కావడం గమనార్హం. గతంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో

మిగతా 2వ పేజీలో..

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లలో ఏఐ వినియోగం



3

నిమ్స్ డాక్టర్ బినామీలపై ఏసీబీ సోదాలు

- డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆస్తుల కేసులో దర్యాప్తు
- హైదరాబాద్‌లో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు
- నిమ్స్ ఉద్యోగి ఇంట్లో రూ.4.94 లక్షల నగదు స్వాధీనం

3



ఫార్ములాఈ కేసులో కేటీఆర్‌కు మరో చిక్కు

- కేటీఆర్ సహా నలుగురి పాస్‌పోర్టులపై ఏసీబీ దృష్టి
- తాత్కాలిక జప్తునకు ఆర్‌పీవోకు ఏసీబీ కోర్టు లేఖ
- రూ.55 కోట్ల హెచ్‌ఎండీఏ నిధుల బదిలీపై కేసు
- ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసిన దర్యాప్తు సంస్థ
- అక్టోబర్ 30కి కేసు తదుపరి విచారణ



హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 29:

ఫార్ములాఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు కేసులోని మరో ముగ్గురు నిందితుల పాస్‌పోర్టులను తాత్కాలికంగా జప్తు చేసే ప్రక్రియ మొదలైంది. ఏసీబీ అభ్యర్థన మేరకు నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాసినట్లు తాజా కథనాలు వెల్లడించాయి. పాస్‌పోర్టులను తాత్కాలికంగా జప్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని

మిగతా 2వ పేజీలో..

పప్పుధాన్యాల సాగు వృద్ధిలో రెండో స్థానం

- రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి తుమ్మల
- క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలి
- పామాయిల్ ధరపై కమిటీ వేస్తామన్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

3





రేపు కరీంనగర్ జిల్లాలో సీఎం పర్యటన

- ఏర్పాట్లపై రవాణా శాఖ మంత్రి పొన్నం సమీక్ష
- నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్న సీఎం

గాంధీ కుటుంబంపై రేవంత్ విధేయత



- రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమన్న సీఎం
- దేశ భవిష్యత్తు 'గాంధీ పరివార్– సంఘ్ పరివార్' మధ్య పోరాటమని వ్యాఖ్య
- కేరళ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- 'కుటుంబం ఫస్ట్' అంటూ రేవంత్‌పై బీజేపీ ఎదురుదాడి
- కాంగ్రెస్‌లోనూ సీఎం వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ

3



ఫార్ములాఈ కేసులో కేటీఆర్‌కు మరో చిక్కు

మొదటిపేజీ తరువాయి

అందులో కోరినట్లు సమాచారం.

రూ.55 కోట్ల బదిలీపై కేసు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములాఈ రేసుకు సంబంధించి హెచ్ఎండీఏ నుంచి సుమారు రూ.55 కోట్లను ఫార్ములాఈ ఆపరేషన్స్‌కు బదిలీ చేసిన వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. అవసరమైన అనుమతులు, ఆర్థిక విధివిధానాలు పాటించకుండానే నిధులు బదిలీ చేశారనేది ఏసీబీ అభియోగం. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ1గా, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా, మాజీ స్పోర్ట్స్ కన్సల్టెంట్ గోవెడ కిరణ్ మల్లేశ్వరరావును ఏ4గా పేర్కొంది.

చార్జిషీట్ దాఖలు

2024 డిసెంబర్‌లో కేసు నమోదు చేసిన ఏసీబీ దర్యాప్తు అనంతరం 2026 మార్చిలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కేటీఆర్‌తోపాటు ఇతర నిందితులు ఇప్పటికే కోర్టుకు హాజరయ్యారు. సెప్టెంబర్ 18న జరిగిన విచారణలోనూ కేటీఆర్, ఇతర అధికారులు నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. కేసులోని రెండు సంస్థల ప్రతినిధులు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబర్ 30కి వాయిదా వేశారు.

తాజాగా నిందితుల విదేశీ ప్రయాణాలను నియంత్రించే దిశగా పాస్‌పోర్టులపై ఏసీబీ చర్యలకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ తిరస్కరిస్తున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఫార్ములాఈ రేసును నిర్వహించామని, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు.

శివారు వెంకటాపూర్ రైతులకు న్యాయం చేస్తా

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 29 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాతముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించగా ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సచివాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శివారు వెంకటాపూర్‌లోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాతముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా మా భూములపై హక్కులు లేకుండా చేశారని, మా పొలాలు మాకు కాకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పటాలను రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద పాత పాస్‌బుక్కులు తీసుకున్నారని, కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి రికార్డులుపాత పాస్‌బుక్కులుగ్రామ నక్షాక్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అలాగే దేవాసుకుంట, ముత్తిలింగంకుంటలను కూడా పాండురంగ రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం.. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్.లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ కేసులో డ్రగ్స్ కలకలం

- మైనర్‌పై లైంగిక దాడి కేసులో సంచలన విషయాలు
- నిందితులకు వైద్య పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్
- బాధితురాలికి మత్తు పదార్థాలు ఇచ్చినట్లు పోలీసుల గుర్తింపు
- డ్రగ్స్ సరఫరా మూలాలపై పోలీసుల ఆరా
- సరఫరాదారుల నెట్‌వర్క్‌పై దర్యాప్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 29:

అల్వాల్‌లో మైనర్‌పై లైంగిక దాడి కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో అరెస్టయిన నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ వినియోగించినట్లు తేలినట్లు సమాచారం. బాధితురాలికి సైతం మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. డ్రగ్స్ మూలాలపై ఆరా సెప్టెంబర్ 9, 10 తేదీల్లో బాధితురాలిపై వేర్వేరు ప్రాంతాల్లో లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదైంది. నిందితులకు మత్తు పదార్థాలు ఎవరు సరఫరా చేశారు? ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. వారి ఫోన్లు, పరిచయాలు, డ్రగ్స్ సరఫరాదారులతో ఉన్న సంబంధాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

కేసులో తొలుత ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు ఆ తర్వాత దర్యాప్తును విస్తరించారు. బాధితురాలికి మత్తు పదార్థాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉండటంతో లైంగిక దాడితోపాటు డ్రగ్స్ కోణంలోనూ ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులకు మత్తు పదార్థాలు చేరవేసిన వారిని గుర్తించడంపై ప్రస్తుతం దర్యాప్తు ప్రధానంగా సాగుతోంది.



11 కేవీ హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు ఏకరీతి ఛార్జీలు!

మొదటిపేజీ తరువాయి

కేసుల వారీ లెక్కింపులకు స్వస్తి..

నూతన నిబంధనల ప్రకారం.. ఇప్పటికే అందుబాటులో ఉన్న 11 కేవీ విద్యుదీకరించిన నెట్‌వర్క్ లేదా కామన్ ఫీడర్ నుంచి ఓవర్‌హెడ్ లైన్ ద్వారా ఒక కిలోమీటర్ పరిధిలో సరఫరా పొందే అర్హత కలిగిన ప్రతి 11 కేవీ హెచ్‌టీ కొత్త కనెక్షన్, అదనపు లోడ్లకు ప్రతి కేవీఏ కాంట్రాక్టెడ్ డిమాండ్‌కు రూ.4,078 చొప్పున సర్వీస్ లైన్ ఛార్జీ వర్తిస్తుంది. గతంలో ప్రతి దరఖాస్తుకు క్షేత్రస్థాయి స్థల పరిశీలన, ప్రత్యేక ఇంజనీరింగ్ అంచనాలు వేసి సర్వీస్ లైన్ ఖర్చును వేర్వేరుగా నిర్ణయించేవారు. దీనివల్ల తీవ్ర జాప్యం జరగడంతో పాటు అవినీతి, వ్యయ అస్పష్టతకు తావుండేది. తాజా విధానంతో నిర్దిష్ట ప్రామాణిక రేటు అమల్లోకి రావడంతో దరఖాస్తుదారులకు ముందుగానే ఖర్చుపై స్పష్టత రావడమే కాకుండా, దస్త్రాల ప్రాసెసింగ్ అత్యంత వేగంగా, సులభతరంగా పూర్తవుతుంది.

పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు నూతన ఉత్తేజం..

ఈ సంస్కరణాత్మక విధానం ద్వారా రాష్ట్రంలోని పారిశ్రామిక, భారీ వాణిజ్య, ఐటీ సంస్థలు, డేటా సెంటర్లకు గణనీయమైన లబ్ధి చేకూరనుంది. నూతన పరిశ్రమలను నెలకొల్పే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విస్తరణ చేపట్టే వాణిజ్య సంస్థలకు విద్యుత్ మౌలిక సదుపాయాల ఖర్చుపై ముందస్తు స్పష్టత లభిస్తుంది. కనెక్షన్ల మంజూరులో జాప్యం తగ్గి, సమయపాలన పాటించడం ద్వారా వ్యాపార నిర్వహణ ప్రక్రియ మరింత సరళతరం కానుంది. తెలంగాణలో పరిశ్రమలకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని మరింత పటిష్టం చేయడానికి, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

ప్రత్యేక కేసులకు సాంకేతిక పరిశీలన యథాతథం

సాధారణ 1 కిలోమీటర్ పరిధిలోని ఓవర్‌హెడ్ లైన్లకు మాత్రమే ఈ స్థిర ఛార్జీ నిబంధన వర్తిస్తుందని టీజీఈఆర్‌సీ స్పష్టం చేసింది. 1 కిలోమీటర్‌కు మించిన లైన్ విస్తరణలు, 33 కేవీ స్థాయి హై వోల్టేజ్ కనెక్షన్లు, భూగర్భ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు వంటి సంక్లిష్ట సందర్భాల్లో సాంకేతిక వ్యయాలు స్థానిక పరిస్థితులను బట్టి మారుతుంటాయి కాబట్టి, వాటిని సంబంధిత ఇంజనీరింగ్ ప్రమాణాల ప్రకారం విడిగా పరిశీలిస్తారు. అలాగే నిబంధనల ప్రకారం వర్తించే సాధారణ డెవలప్‌మెంట్ ఛార్జీలు ఎప్పటిలాగే అమలవుతాయి. ఈ రూ.4,078/కేవీఏ ఛార్జీ కేవలం సర్వీస్ లైన్ కోసమేనని, వినియోగదారు ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్, మీటరింగ్ ఏర్పాట్ల వ్యయం ఇందులో చేర్చబడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యుత్ రంగ సంస్కరణల్లో మరో మైలురాయి

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా గ్రిడ్ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన వినియోగదారు కేంద్రిత పాలనను అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని అధికార వర్గాలు వెల్లడించాయి. టీజీఈఆర్‌సీ తీసుకున్న ఈ సమగ్ర నిర్ణయం విద్యుత్ శాఖలో దశాబ్దాల వ్యవస్థను, కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని రూపుమాపుతుంది. వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొంటూ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సామర్థ్యాన్ని మరింత ఆధునీకరించే దిశగా ఈ ఏకరీతి సర్వీస్ లైన్ విధానం అత్యంత కీలక ముందడుగుగా నిలవనుంది.

రేపు కరీంనగర్ జిల్లాలో సీఎం పర్యటన

కరీంనగర్, సిరి న్యూస్, సెప్టెంబర్ 29 :

కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరీంనగర్ జిల్లాలో బుధవారం పర్యటించనున్నారు. నూతనంగా నిర్మించిన కరీంనగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. నూతన కలెక్టరేట్ భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కలెక్టర్‌ను వారి ఛాంబర్‌లోని సీట్లో ఆశీనులను చేయిస్తారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధిపై జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు

కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి పొన్నం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అభివృద్ధి జరగాల్సి ఉండె అని మంత్రి పొన్నం అన్నారు. గత పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల ఆశయాలకు తగిన ప్రాధాన్యత దక్కలేదని విమర్శించారు. గత పదేళ్లుగా శాతవాహన యూనివర్సిటీకి కనీసం వీసీని కూడా నియమించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమం తదితర రంగాల్లో అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధితోపాటు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యావకాశాలను పెంచామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి లోటు లేకుండా ప్రజాపాలన ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని పెంచి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అర్హులైన వారికి రేషన్ కార్డులు, సన్న బియ్యం, రైతు భరోసా, రైతులకు బోనస్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 70 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హాస్టళ్లలో డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి, కలికోట సూరంపేట తదితర ప్రాజెక్టుల పురోగతిపై దృష్టి పెట్టిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.250 కోట్లు కేటాయించామని, మిడ్ మానేరు ప్రాజెక్టు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

కరీంనగర్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

మానేరు రివర్ ఫ్రంట్, డంపింగ్ యార్డ్, కరీంనగర్ రింగ్ రోడ్డు తదితర కీలక అంశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో ఉన్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కరీంనగర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లకు వెళ్లనున్నారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. నేతన్నల సమస్యల పరిష్కారం, పాత బకాయిల చెల్లింపుతో పాటు చేనేత, పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసాను ముఖ్యమంత్రి తన పర్యటన ద్వారా కల్పించనున్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

టీజీఎస్పీడీసీఎల్ చరిత్రలోనే సరికొత్త రికార్డు..

- **వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ రంగాల అవసరాలకు అనుగుణంగా నెట్‌వర్క్ బలోపేతం**
- **సీఎండీ జితేష్ వి. పాటిల్ వెల్లడి**

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్ 11, 2026న మధ్యాహ్నం 12:44 గంటలకు నమోదైన 11,828 మెగావాట్ల గరిష్ట డిమాండ్ రికార్డును తాజా డిమాండ్ అధిగమించింది.

జీహెచ్ఎంసీ పరిధిలో..

సోమవారం సాయంత్రం 6:42 గంటలకు 4,072 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా, 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్ 4,782 మెగావాట్లు కాగా.. అది మే 22, 2026న సాయంత్రం 3:33 గంటలకు (101.07 మిలియన్ యూనిట్ల వినియోగంతో) నమోదైంది.

రాష్ట్ర స్థాయిలో..

తెలంగాణ ట్రాన్స్‌కో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 28న రాష్ట్రంలో 19,133 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ మధ్యాహ్నం 12:56 గంటలకు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 326.70 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్ 19,543 మెగావాట్లు (సెప్టెంబర్ 9, 2026)గా ఉంది.

ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలు: సీఎండీ

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాలకు, రైతులు సాగు చేస్తున్న వరి మరియు ఇతర పంటలకు అవసరమైన విద్యుత్‌ను ప్రభుత్వం నిరంతరాయంగా అందిస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో చేపడుతున్న ముందస్తు ప్రణాళికలు, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, నెట్‌వర్క్ బలోపేతం, ప్రసార మరియు పంపిణీ వ్యవస్థల ఆధునీకరణ చర్యల ఫలితంగానే పెరుగుతున్న డిమాండ్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా తీర్చగలుగుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో డేటా సెంటర్లు, ఐటీ పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, మెట్రో రైలు విస్తరణ, వ్యవసాయ రంగం మరియు పట్టణీకరణ కారణంగా విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని.. రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌కో మరియు డిస్కంలు సమగ్ర ప్రణాళికలతో విద్యుత్ మౌలిక వసతుల విస్తరణను వేగవంతం చేశాయి. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వి. పాటిల్ మాట్లాడుతూ.. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందస్తు ప్రణాళికలు, నెట్‌వర్క్ బలోపేతం మరియు సమర్థవంతమైన నిర్వహణ ద్వారా విజయవంతంగా తీర్చగలుగుతున్నాం. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, విద్యుత్ సరఫరా అందించడమే మా ప్రధాన లక్ష్యం. విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం అని తెలిపారు.

పేదల కన్నీటికి విలువ కట్టలేం

- **ఏడాది లోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం**
- **సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 29 :

తమది పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్టుమెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి మంత్రి పొంగులేటి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహానగరంలో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 1617 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఏడాదిలోపే ఇంటి తాళాలు

ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్టుమెంట్ విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు, మూడు సంవత్సరాల సమయం తీసుకోకుండా ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తి చేసి ఇదే వేదిక నుంచి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం సర్టిఫికెట్లు ఇచ్చి వదిలేయకుండా అవసరమైతే పిల్లల చదువులు, వివాహాలు వంటి కుటుంబ అవసరాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఇళ్లను రూపాయి కమీషన్ లేకుండా, రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలోని డ్రైనేజీని మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యాన్ని కూడా నిర్ధారిస్తామని చెప్పారు. వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించే అవకాశం కల్పించి తమ ఇల్లు నాణ్యతతో నిర్మిస్తున్నారా లేదా అన్నది స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఇస్తామని మంత్రి తెలిపారు.

నగరానికి మధ్యలోనే ఇళ్లు కట్టిస్తాం

గత ప్రభుత్వాలు నగరంలో పేదలు నివసించే ప్రాంతాలకు 3040 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల జీవనోపాధి కోసం వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. పేదల జీవనోపాధి, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ప్రతి తండాలో, ప్రతి గూడెంలో, ప్రతి డివిజన్‌లో, ప్రతి వార్డులో పేదలకు ఇళ్లు నిర్మించి చూపిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఇళ్ల నిర్మాణం కంటే ప్రజా ప్రభుత్వం తొలి విడతలోనే రెట్టింపు ఇళ్లు నిర్మించి చూపిస్తున్నదని చెప్పారు. పేదల సొంతింటి కలను ఎన్నికల హామీగా కాక ప్రభుత్వ బాధ్యతగా భావించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఎంపికైన 480 మందికి మంత్రి అభినందనలు తెలియజేశారు. లక్కీ డ్రాలో విజేతలైన లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి ఇళ్ల నెంబర్లు కేటాయిస్తూ వారి పేర్లను ప్రకటించారు. మంత్రి చేతుల మీదుగా మాదేసు లత అనే మహిళకు డ్రాలో ఇందిరమ్మ ఎ టవర్‌లోని 801 ఇంటిని కేటాయిస్తూ ప్రకటన చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 29 :

ఓటమి భయంతో రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. రాముడు, శివుడిని వేరు చేస్తూ సమాజాన్ని చీల్చాలని చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు బీజేపీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు పార్టీలో చేరగా వారిని సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల బ్రిస్బేన్(ఆస్ట్రేలియా)లో ఇండియన్ కల్చరల్ సొసైటీ ఆహ్వానం మేరకు పర్యటించి వచ్చిన రామచందర్ రావును పార్టీ నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ఎన్నికల ప్రక్రియను అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలే ప్రశంసిస్తూ, అధ్యయనం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యవస్థను, ప్రతిష్ఠను ప్రపంచ వేదికలపై కించపరుస్తోందని మండిపడ్డారు.

'సర్'పై కాంగ్రెస్ నేతల ద్వంద్వ ప్రమాణాలు

దేశవ్యాప్తంగా చేపట్టిన 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్, 'ఇండి' కూటమి తప్పుడు ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన, దొంగ ఓట్ల తొలగింపు, అసలైన ఓటర్లకు న్యాయం చేయడమే ఎసఐఆర్ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో 2018లో తెలంగాణ, రాజస్థాన్‌లలో ఓట్ల తొలగింపుపై అభిషేక్ మను సింఘ్వి, సచిన్ పైలట్, పశ్చిమ బెంగాల్‌లో జవహర్ సిర్కార్ వంటి కాంగ్రెస్, కూటమి నేతలే వేలాది దొంగ ఓట్లు ఉన్నాయని మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళం ఎన్నికల్లో సర్' ప్రక్రియ సక్రమంగా జరగడం వల్లే తమకు ప్రయోజనం కలిగిందని కాంగ్రెస్ నాయకుడు రమేష్ చెన్నితాల సైతం స్వయంగా అంగీకరించారని తెలిపారు.



ఈసీఐ న్యూట్రాలిటీపై తప్పుడు ప్రచారం

ఎన్నికల సంఘం సభ్యుల మధ్య విభేదాలున్నాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని రామచందర్ రావు తిప్పికొట్టారు. ఈసీఐ సభ్యుల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, పరిపాలనాపరమైన స్పష్టత కోసమే నోట్ రాశారని ఇప్పటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి సంయుక్తంగా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో సుకుమార్ సేన్, కల్యాణ్ సుందరం, ఎస్పీ సేన్ వర్మ, నాగేంద్ర సింగ్, టి.స్వామినాథన్, ఆర్.కె.త్రివేది వంటి కమిషనర్లకు పదవీ విరమణ తర్వాత పదవులు, పద్మ పురస్కారాలు, గవర్నర్‌గిరీలు ఇచ్చి రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసింది కాంగ్రెస్ పార్టీయేనని మండిపడ్డారు. ప్రధాని మోదీ హయాంలో పారదర్శకమైన ఎంపిక ప్రక్రియతో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.

హిందూ దేవుళ్లను విభజిస్తున్న రేవంత్ క్షమాపణ చెప్పాలి

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను వాడుకుంటూ సమాజాన్ని నిలువునా చీల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బరితెగించారని రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. 'పేదవాడైనా, ధనికుడైనా ఏ కష్టమొచ్చినా రాముడిని, కృష్ణుడిని, శివుడిని, దేవుళ్లందరినీ స్మరిస్తామని గుర్తుచేశారు. భూముల అమ్మకాలు, భూదందాలతో వేల కోట్లు వెనకేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయి.. ఆయనకు ఎలాంటి కష్టాలూ లేవు కాబట్టే దేవుళ్లపై పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు' అని రామచందర్ రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమానించడం ఇదే మొదటిసారి కాదన్నారు.

రేవంత్ రెడ్డి 'రేవంతుద్దీన్' అయ్యారు

రాహుల్, సోనియాలకు నెలవారీ ముడుపులు పంపిస్తూ వారి కనుసన్నల్లోనే రేవంత్ రెడ్డి ఈ విద్వేష ప్రచారానికి ఒడిగడుతున్నారని చెప్పారు. గతంలో స్వయంగా ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం అని బహిరంగంగా ప్రకటించిన రేవంత్ ఇప్పుడు కల్మాలు చదువుకుంటూ 'రేవంతుద్దీన్'గా మారిపోయారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉత్తరదక్షిణ బేధాలు, కులాల చిచ్చులు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా హిందూ దేవుళ్ల మధ్య వైషమ్యాలు రగిల్చే స్థాయికి దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కోట్లమంది హిందువుల మనోభావాలను గాయపరచడమేనన్నారు. రాముడు, శివుడు ఒకటేనన్న కనీస సాంస్కృతిక స్పృహ, ఇంగితజ్ఞానం ముఖ్యమంత్రికి లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. రేవంత్ రెడ్డికి దేవుళ్లపై నమ్మకం లేకపోతే ఇంట్లో కూర్చోవాలి తప్ప అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసమే హిందూ వ్యతిరేక కుట్రలు

త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ముస్లిం ఓట్లను పొందేందుకే రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై విషం చిమ్ముతున్నారని రామచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై పరుస దాడులు జరిగాయని దుయ్యబట్టారు. ఒకవైపు వక్ఫ్ బోర్డు భూములను అక్కున చేర్చుకుంటూ మరోవైపు దేవాదాయ శాఖ భూములను యథేచ్ఛగా అమ్ముకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఈరోజు బీజేపీలో చేరిన ప్రముఖ వైద్యులు, మానసిక నిపుణుల బృందాన్ని సీఎం వద్దకు పంపి ఆయనకు కౌన్సెలింగ్, చికిత్స ఇప్పించాల్సిన అవసరం ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు. దేవుళ్లపై నమ్మకం లేని, హిందూ సమాజాన్ని అవమానించే నాయకుల ఫ్లెక్సీలను ఇకపై ఏ ఆలయం ముందూ పెట్టనిచ్చేది లేదని హెచ్చరించారు. సీఎం వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో బుధవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు రామచందర్ రావు ప్రకటించారు. సమావేశంలో పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్ట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో డాక్టర్ల చేరిక

ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి శర్మ, డాక్టర్ సుభాష్, డాక్టర్ రణ్‌వీర్ సింగ్ జీ, డాక్టర్ జీవిత రవిపాటి, డాక్టర్ పమేలా, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ శ్రీ నగేష్, డాక్టర్ హనుమంతరావు, తదితరులు పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి రామచందర్‌రావు సాదరంగా ఆహ్వానించారు.

గాంధీ కుటుంబంపై రేవంత్ విధేయత

- **రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమన్న సీఎం**
- **దేశ భవిష్యత్తు 'గాంధీ పరివార్–సంఘ్ పరివార్' మధ్య పోరాటమని వ్యాఖ్య**
- **కేరళ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
- **'కుటుంబం ఫస్ట్' అంటూ రేవంత్‌పై బీజేపీ ఎదురుదాడి**
- **కాంగ్రెస్‌లోనూ సీఎం వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ**

హైదరాబాద్, సెప్టెంబర్ 29:

గాంధీ కుటుంబంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూరులో సెప్టెంబర్ 25న జరిగిన ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటాన్ని 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' మధ్య పోరుగా అభివర్ణించారు. రాజకీయంగా తనకు వ్యక్తిగత లక్ష్యాలేవీ మిగల్లేదని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడటమే తన కల అని ప్రకటించారు.

గాంధీ కుటుంబమే కేంద్రంగా..

మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని రేవంత్ పేర్కొన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పదవులు, అధికారాన్ని త్యాగం చేశారని చెప్పారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం గాంధీ కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తన రాజకీయ ప్రయాణంలో జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు అనేక పదవులు చేపట్టానని, ఇక రాహుల్‌ను ప్రధానిగా చూడటమే తన రాజకీయ ఆకాంక్షగా పేర్కొన్నారు.

బీజేపీ ఎదురుదాడి

రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. కాంగ్రెస్‌కు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమైతే, తమకు దేశ ప్రయోజనాలే ప్రధానమని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ఒక ముఖ్యమంత్రి ప్రజలకు అంకితభావంతో ఉండాలని, ఒక కుటుంబానికి కాదని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం కాంగ్రెస్ రాజకీయాలు ఒక కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయని ఆరోపించారు.

రాజకీయంగా ఆసక్తికర చర్చ

రేవంత్ వ్యాఖ్యల వెనుక ఉద్దేశాలపై రాజకీయ వర్గాల్లో భిన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత కొద్దికాలంలోనే టీపీసీసీ అధ్యక్షుడిగా, అనంతరం ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్.. గాంధీ కుటుంబ నాయకత్వంపై తన విధేయతను బహిరంగంగా చాటుతున్నారని ఒక వర్గం విశ్లేషిస్తోంది. అయితే ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు లేదా పదవీ సమీకరణాలతో ముడిపెట్టేందుకు ప్రత్యక్ష ఆధారాలు లేవు.

మరోవైపు రేవంత్ వ్యాఖ్యలను కాంగ్రెస్‌పై విమర్శలకు బీజేపీ రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తోంది. 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యతో మొదలైన మాటల యుద్ధం ఇప్పుడు కుటుంబ రాజకీయాలు, జాతీయ ప్రయోజనాల చుట్టూ తిరుగుతోంది. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడటమే తన లక్ష్యమంటూ రేవంత్ చేసిన ప్రకటనతో ఈ రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లలో ఏఐ వినియోగం

- **అనలిటిక్స్ తో కూడిన ఆధునీకరణకు రవాణా శాఖ ప్రణాళిక**
- **డ్రైవింగ్ పరీక్షల్లో మానవ జోక్యాన్ని పూర్తిగా తగ్గించేలా కసరత్తు**
- **ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం**
- **కమిటీ నివేదిక ఆధారంగా ముందడుగు**
- **మొదటి దశలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 5 ట్రాక్‌లు..**
- **కరీంనగర్ ట్రాక్‌లో ఏఐ వీడియో అనలిటిక్స్ అమలు**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):



తెలంగాణ వ్యాప్తంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక అనలిటిక్స్ వ్యవస్థతో మరింత పారదర్శకంగా ఆధునీకరించేందుకు రవాణా శాఖ గట్టి ప్రణాళికలు రచిస్తోందని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీందర్ కుమార్, ఆర్టీఓ రఘునందన్ తదితరులతో కలిసి కొండాపూర్, నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను హెచ్ఎండీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించి రహదారి భద్రతను పెంపొందించాలంటే డ్రైవింగ్ పరీక్షలు మరింత కఠినంగా, పూర్తిగా పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందని, పరీక్షల ప్రక్రియలో మానవ జోక్యాన్ని సాధ్యమైనంతగా తగ్గించాలని పేర్కొన్నారు. ఇటీవల ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ప్రత్యేక కమిటీ సభ్యులు ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలను సందర్శించి.. అక్కడ విజయవంతంగా అమలవుతున్న ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు వెల్లడించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబరితి ఆదేశాల మేరకు ఈ ఆధునీకరణ పనులు వేగవంతం చేసినట్లు జేటీసీ తెలిపారు. మొదటి దశలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 5 డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లతో పాటు కరీంనగర్ ఆర్టీఓ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను కూడా ఆధునీకరిస్తామని చెప్పారు. ఇక్కడ అత్యాధునిక ఏఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ విధానంలో డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రవాణా శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని స్పష్టం చేశారు.

మారుతి సుజుకి భాగస్వామ్యం

రవాణా శాఖ మరియు మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ సంస్థ సంయుక్తంగా ప్రస్తుత డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయనున్నాయి. ఇందులో భాగంగానే ఏఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ ద్వారా పరీక్షల నిర్వహణపై మంగళవారం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించినట్లు చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారులు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, విక్రమ్, ఆర్కిటెక్ట్ ఆకాష్ రెడ్డి, కమిటీ సభ్యులు అమృత వర్షిణి, అభిలాష్ నాయక్, నేహా, ఆర్టీవో కొండయ్య తదితరులు పాల్గొని ట్రాక్‌ల సాంకేతిక అంశాలపై చర్చించారు.



పప్పుధాన్యాల సాగు వృద్ధిలో రెండో స్థానం

న్యూదిల్లీ, సెప్టెంబర్ 29 :

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగులో గత ఏడాది ఖరీఫ్ కంటే 36% అధికంగా సాగుచేసి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతితోపాటు రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను మంగళవారం జరిగిన జాతీయ రబీ సదస్సులో ఆయన వివరించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో 36% వృద్ధితో తెలంగాణ ముందు వరుసలో నిలిచిందన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో, కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) పరిధిలోకి తీసుకురావాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అనేక మండలాలు లోటు, తీవ్ర లోటు వర్షపాత పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రాష్ట్ర సగటు వర్షపాతం ఆధారంగా కాక మండలాల స్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని కోరారు. సూక్ష్మ సాగునీరు, రక్షిత సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రత్యేక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ సాగు విషయంలో తెలంగాణ రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు సానుకూలంగా స్పందించారని చెప్పారు. రాష్ట్రంలో అదనంగా దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, సుమారు 72 వేల మంది కొత్త రైతులు ఆయిల్‌పామ్ సాగులోకి వచ్చారని వివరించారు. రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ధరలు ఎంతో ముఖ్యమని, రైతుల్లో నమ్మకాన్ని కొనసాగించేందుకు కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. దిగుమతుల విధానం కూడా రైతులకు అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీని నియమించి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తుమ్మల తెలిపారు. తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని ప్రస్తుతమున్న సుమారు లక్ష నుంచి రెండు లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా ప్రస్తుతం 16 కృషి విజ్ఞాన కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, అదనంగా 16 కృషి విజ్ఞాన కేంద్రాలను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఐసీఏఆర్‌ను కోరారు. కొడంగల్‌లో అగ్రి బిజినెస్ పార్క్, సెమీఅరిడ్ హార్టికల్చర్ క్రాప్స్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌లను సమర్పించిందని మంత్రి తెలిపారు. కీలకమైన ఈ రెండింటికి కేంద్రం సహకారం అందించాలని కోరారు. రైతులకు కేవలం విత్తనాలు, ఎరువులే కాక సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, శాస్త్రీయ సలహాలు, నీటి పొదుపు విధానాలు, వ్యవసాయ విస్తరణ సేవలు, మౌలిక వసతులు, నమ్మకమైన మార్కెట్లు అవసరమని మంత్రి పేర్కొన్నారు. పరిశోధన, వ్యవసాయ విద్య, విస్తరణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే కొత్త సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వేగంగా చేరుతుందని తెలిపారు.



నిమ్స్ డాక్టర్ బినామీలపై ఏసీబీ సోదాలు

- **డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆస్తుల కేసులో దర్యాప్తు**
- **హైదరాబాద్‌లో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు**
- **నిమ్స్ ఉద్యోగి ఇంట్లో రూ.4.94 లక్షల నగదు స్వాధీనం**
- **మహేశ్వరంలో రూ.57 లక్షల విలువైన వ్యవసాయ భూముల పత్రాలు**
- **బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు**

హైదరాబాద్, సెప్టెంబర్ 29:

నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఆయనతో సంబంధాలున్న అనుమానితులు, బినామీలుగా భావిస్తున్న వారి ఇళ్లలో హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. నగదుతోపాటు వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్, పెట్టుబడులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు.. మహేశ్వరం ప్రాంతంలోని మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.57 లక్షలుగా అంచనా వేశారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సుమారు రూ.2.70 కోట్ల విలువైన ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా లభించినట్లు ఏసీబీ తెలిపింది. పెట్టుబడులపైనా ఆరా నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి.గణేష్ పేరుతో ఉన్న సుమారు రూ.20 లక్షల పెట్టుబడుల వివరాలతోపాటు మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడులను అధికారులు గుర్తించారు. రూ.3 లక్షల హ్యాండ్‌లోన్‌కు సంబంధించిన రసీదులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తులు, పెట్టుబడులకు డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై సెప్టెంబర్ 21న కేసు నమోదు చేసిన ఏసీబీ.. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, ఆర్థిక లావాదేవీల ఆధారంగా దర్యాప్తును కొనసాగిస్తోంది.

క్రీడా, సాంస్కృతిక విజేతలకు గీతం సత్కారం..



పటాన్ చెరు, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్) :

క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన గీతం హైదరాబాద్ విద్యార్థులను మంగళవారం విశ్వవిద్యాలయ నాయకత్వం సత్కరించింది. రాబోయే పోటీల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తేవాలని సూచించింది. సెప్టెంబర్ 26, 27 తేదీల్లో గీతం విశాఖపట్నం ప్రాంగణంలో జరిగిన డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి మెమోరియల్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో హైదరాబాద్ విద్యార్థులు అథ్లెటిక్స్‌లో 17 పతకాలు సాధించారు. టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, పికిల్‌బాల్‌లో రజత పతకాలు, 'బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్', 'కల్చరల్ ఛాంపియన్‌షిప్'లో ప్రథమ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగించిన పోలీసులు



పాపన్నపేట సెప్టెంబర్ 29 సిరి న్యూస్:

పోగొట్టుకున్న ఫోన్లో రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానం నిలిచారు. వివరాల్లోకెళ్తే గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఫోన్ల బాధితులు మీసేవ ద్వారా కంప్లైంట్ చేశారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 601 ఫోన్లను పోలీసులు గుర్తించగా అందులో 589 సెల్ ఫోన్లు (98 శాతం) రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మంగళవారం సైతం మరో 12 ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు ఫోన్లను అప్పగించారు. ఈ 12 ఫోన్ల విలువ 2 లక్షల 4500 విలువ ఉంటుంది. పోగొట్టుకున్న ఫోన్లను అతి త్వరలోనే గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో పాపన్నపేట పోలీసులు జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచారు. గతంలో సైతం పెద్ద ఎత్తున ఫోన్లు రికవరీ చేసి డిఎస్పి చేతుల మీదుగా అందజేశారు. పోయిన ఫోన్లను రికవరీ చేసి అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

గౌడుల అభ్యున్నతికి కృషి చేస్తా: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రపురం, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

రామచంద్రపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్‌లో ఉన్న కల్లు దుకాణానికి అనుమతులు మంజూరైన సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మంగళవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని వర్గాలు, కులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కుల వృత్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, గౌడుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. గౌడ సంఘం నాయకులు తాళ్ల కుమార్ గౌడ్, మాణిక్‌ప్రభు గౌడ్, నాగులు గౌడ్, తిరుమల్ గౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ పిల్లల మధ్య జూలకంటి రాజ శేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



సూర్యాపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 29, సిరి న్యూస్:

చీదేళ్ళ మాజీ ఎంపీటీసీ జూలకంటి వెంకట్ రెడ్డి గారి పెద్ద కుమారుడు జూలకంటి రాజశేఖర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను కోదాడ లోని శనగల రాధ కృష్ణ అనాధ ఆశ్రమం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లల సమక్షంలో రాజశేఖర్ రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ కీర్తి యలమంచయ్య గౌడ్, జూలకంటి సత్తి రెడ్డి, పందుల నాగరాజు, కొండమీది సుధాకర్, రాయిశెట్టి సతీష్, కొండమీది నవీన్ (కే పి) తదితరులు పాల్గొని రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

గుండె ఆరోగ్యంపై అవగాహనకు వాకథాన్..

- **- ప్రపంచ హృదయ దినోత్సవం.. మెడికవర్ ఆధ్వర్యంలో నడక**

రామచంద్రపురం, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):



ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి చందానగర్ ఆధ్వర్యంలో మంగళవారం 'వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్' పేరుతో 4 కిలోమీటర్ల వాకథాన్ నిర్వహించారు. బీరంగూడ కమాన్ నుంచి లింగంపల్లి బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు సాగిన కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డా. భారవి చుండూరి, డా. శ్రవణ్ కుమార్ వి. హృదయ సంబంధిత వ్యాధుల నివారణకు ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల ఆహారం, రక్తపోటు, మధుమేహ నియంత్రణ అవసరమని వివరించారు. యువతలోనూ గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ మల్లేష్ పాల్గొన్నారు.

దక్షిణాది పుణ్యక్షేత్రాలు గోవా అందాలు టీఎస్ఆర్టీసీ ప్రత్యేక టూర్

- **రూ.6,200కే నాలుగు రోజుల ప్యాకేజీ**
- **-అక్టోబర్ 1న బీహెచ్ఈఎల్ డిపో నుంచి ప్రయాణం**

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 29(సిరి న్యూస్):



దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు గోవా పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు టీఎస్ఆర్టీసీ బీహెచ్ఈఎల్ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఏర్పాటు చేశారు. రాజధాని ఏసీ బస్సులో నిర్వహించే ఈ యాత్ర అక్టోబర్ 1న మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో కుక్కే సుబ్రహ్మణ్యం, ధర్మస్థలం, ఉడిపి శ్రీకృష్ణ ఆలయాలను భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించారు. అనంతరం మురుడేశ్వర్, గోకర్ణ ప్రాంతాలను సందర్శించి, అక్టోబర్ 4న గోవాలోని పర్యాటక ప్రాంతాలను తిలకించేలా ప్రయాణ ప్రణాళిక రూపొందించారు.ఈ టూర్ ప్యాకేజీకి ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.6,200 చార్జీగా నిర్ణయించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఉడిపి లేదా ధర్మస్థలంలో ఒక రాత్రి, గోవాలో మరో రాత్రి వసతి కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 5న బస్సు హైదరాబాద్‌కు చేరుకోనుంది. అయితే భోజనం, వ్యక్తిగత అవసరాలు, ఇతర అదనపు ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాల కోసం 8500309052, 9063400960 నంబర్లను సంప్రదించాలని బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ వి. మోహన్‌రావు సూచించారు. టూర్ సర్వీస్ నంబర్ 91661గా పేర్కొన్నారు.

చెరువుల అభివృద్ధికి అధికారుల ఉమ్మడి కసరత్తు



- **సున్నం చెరువు, తిమ్మిడికుంట పరిసరాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

సున్నం చెరువు, తిమ్మిడికుంట అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ఛాంబర్‌లో సీఎంసీ, హైడ్రా, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఉన్నతాధికారులు సమావేశమై ప్రతిపాదిత పనులపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిసరాల అభివృద్ధి, రహదారి అనుసంధాన పనులను సకాలంలో పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించారు. సున్నం చెరువు వద్ద కల్వర్ట్ వరకు సెంట్రల్ మీడియన్ పొడిగింపు, ఫుట్‌పాత్ విస్తరణ, అలంకరణ లైటింగ్, వీధి దీపాల ఏర్పాటు, పర్వత్‌నగర్ నుంచి చెరువుకు రహదారి కనెక్టివిటీ వంటి అంశాలను సమీక్షించారు. తిమ్మిడికుంట పరిసరాల్లోనూ ప్రజలకు మెరుగైన రాకపోకలు, సౌకర్యాలు కల్పించేలా పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వెనుక ప్రవేశద్వారం నుంచి ఏసీ బస్‌స్టాప్ వరకు ఫుట్‌పాత్ అనుసంధానం, చెరువు చుట్టూ అలంకరణ లైటింగ్, సింధు ఆస్పత్రికి రహదారి అనుసంధానం, స్మైలైన్ డెంటల్ వైపు ఉన్న అవుట్‌లెట్ డ్రెయిన్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణం తదితర అంశాలపై అధికారులు చర్చించారు. గుర్తించిన పనులకు సంబంధించి ఆయా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని, నిర్దేశించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.

ప్రమీల మృతి బాధాకరం !!

- **మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు**

శివ్వంపేట సెప్టెంబర్ 29 (సిరి న్యూస్) :



రాష్ట్ర మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ సహకార సంఘం వైస్ చైర్ పర్సన్ కల్లూరి కీర్తన మాతృమూర్తి గట్టు ప్రమీల మృతి బాధాకరమని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు అన్నారు. శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన, తల్లీ ప్రమీల ఇటీవల అకాల మరణం పొందారు. అయితే సంఘం పెద్దల ద్వారా ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ సర్పంచ్ హన్మంత్ రావు తో కలిసి మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామానికి వెళ్లి కల్లూరి కీర్తన పటేల్ ను పరామర్శించి, ఆమె కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. అనంతరం కీర్తన తండ్రి గట్టు ఆంజనేయులు పటేల్, ఆమె సోదరులు గట్టు శ్రీధర్ పటేల్, గట్టు సురేష్ పటేల్ లకు కూడా పురుషోత్తమరావు మనో నిబ్బరం గా ఉండాలని సూచించారు. గట్టు ప్రమీల ఆత్మకు శాంతించేకూరాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడుని వేడుకుంటున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు చెప్పారు. ఈ సమయంలో వారి వెంట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, నాయకులు గట్టు నిఖిల్, మృతురాలి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ ఎన్నికల హామీ నెరవేర్పు



- **ఎస్సీ మాల కమ్యూనిటీ**
- **హాల్ కు రూ.10 లక్షల నిధులు మంజూరు.**
- **పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.**
- **లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్, మండల బిజెపి అధ్యక్షుడు గొల్లపల్లి నవీన్ గౌడ్**

రామాయంపేట, సెప్టెంబర్ 29

(సిరి న్యూస్) రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, గ్రామంలోని ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ నిర్మాణం / అభివృద్ధి కోసం రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, సర్పంచ్ నవీన్ గౌడ్ చొరవ తీసుకుని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు దృష్టికి తీసుకు వెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఈ నిధులను మంజూరు చేశారని సర్పంచ్ నవీన్ గౌడ్ తెలిపారు. ఈ నిధులతో త్వరలోనే కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించబడతాయనీ, ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు సహకరించిన నాయకులకు, గ్రామ పెద్దలకు మరియు గ్రామ ప్రజలకు సర్పంచ్గా ల్లపల్లి నవీన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ మల్లేష్, సాయి గ్రామ పెద్దలు దుబ్బాగౌడ్ చేపూరి రామస్వామి యాదగౌడ్ రావుల మోహన్ బిజెపి నాయకులు బండి జగన్ రంజిత్ గౌడ్ భూత్ అధ్యక్షులు బాలరాజ్ రావుల సిద్ధ రాములు భాను ప్రకాష్ నాగరాజు మైపాల్ చేపూరి స్వామి నంద్ర బోయిన శివ రాజు మరియు కుల సభ్యులు పాల్గొన్నారు

పెళ్లి విషయంలో గొడవ.. యువతి మృతి



- **మాదాపూర్ ఓయో హోటల్ ఘటనలో నిందితుడి అరెస్ట్**

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 29(సిరి న్యూస్):

మాదాపూర్‌లోని ఓ ఓయో హోటల్‌లో నిఖిత అనే యువతి మృతి చెందిన ఘటనలో పోలీసులు శ్రీనివాస రవితేజను అరెస్ట్ చేశారు. నిఖిత, రవితేజ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారని, పెళ్లి విషయమై ఇద్దరి మధ్య వివాదం జరిగిన సమయంలో రవితేజ దాడి చేయడంతో ఆమె మృతి చెందినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అనంతరం నిందితుడు హోటల్ నుంచి పరారయ్యాడు. సాంకేతిక ఆధారాలతో రవితేజ కదలికలను గుర్తించిన మాదాపూర్ పోలీసులు విశాఖపట్నంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల భయంతో అక్కడ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించి మెదక్ ను క్రీడా హబ్ గా తీర్చిదిద్దాలి

- గెలుపోటములు సహజం..
- ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకోవాలి.
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి.
- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు.

మెదక్ సెప్టెంబర్.29(సిరి న్యూస్)



క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఓటమిని గెలుపునకు పునాదిగా మలుచుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి మెదక్ ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాధిక భూపతిరాజు మాట్లాడుతూ మెదక్‌లో అథ్లెటిక్ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియం ఉండటం క్రీడాకారులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. స్టేడియాలను సంరక్షించుకుంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. గతంలో మెదక్ ప్రాంతానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల మాట్లాడుతూ మెదక్‌లోని అథ్లెటిక్, పీఎన్‌ఆర్ ఇండోర్ స్టేడియాల్లో నిత్యం 200 మందికిపైగా క్రీడాకారులు సాధన చేస్తున్నారని తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాక్సింగ్ తదితర అకాడమీల ఏర్పాటుకు కలెక్టర్ కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి అనుముల మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 230 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ క్రీడోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, సుజాతకుమారి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు
- నీటి సమస్య తలెత్తకుండా నూతన బోర్లు
- వీధి దీపాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక
- శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, సెప్టెంబర్ 29, (తెలంగాణ వాణి)



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటూ, అందుకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ సర్కిల్, పటాన్ చెరు సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల నూతన బోర్స్ వేయాలని ఆదేశించారు. సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పారిశుద్ధ్య విభాగానికి స్వీపింగ్ మెషీన్లు, టిప్పర్లు కొనుగోలు చేయడం జరిగిందని, త్వరలోనే వాటిని అందజేయడం జరుగుతుందని తెలిపారు. వారానికి ఒకసారి ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని, తాను సైతం పాల్గొంటానని తెలిపారు. ప్రజల నుండి వీధి దీపాల అంశంపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులకు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వెంటనే సరిపడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈలు కృష్ణవేణి, వెంకట రమణ, చరణ్ సింగ్, తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటాన్ చెరు లో ఘనంగా ప్రారంభమైన ఎస్ జి ఎఫ్ మండల స్థాయి పోటీలు

- లాంచనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్
- క్రీడలు, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

పటాన్ చెరు , సెప్టెంబర్ 29, (సిరి న్యూస్):



విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా సహకారం అందిస్తే, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు లభిస్తాయని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పటాన్ చెరు మండల స్థాయి క్రీడోత్సవాలను, ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు పటాన్ చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం ఉచిత శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలకు సైతం అతిథ్యం అందించబోతున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కు కుమార్ గౌడ్, శివారెడ్డి, వెంకటేష్, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, వివిధ పాఠశాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం





వెల్దుర్తి,సెప్టెంబర్ 29,(సిరి న్యూస్):

పదవ తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడంతో పాటు, వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులను ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో బోధన అందిస్తున్నారు. ఉదయం పాఠశాల సమయానికి ముందు, సాయంత్రం పాఠశాల అనంతరం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు సందేహ నివృత్తి, పునశ్చరణ, ప్రశ్నపత్రాల సాధన, పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరై, ఉపాధ్యాయుల సూచనలను పాటించి, కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా పంపించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నర్సింహా రెడ్డి, ఖదీర్ పాషా, విజయ్, శైల జ, అర్చన, రాధిక, నవనీత తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.పదవ తరగతి విద్యార్థులకు గణితం పై ప్రత్యేక తరగతి నిర్వహించడం జరిగింది.

డయల్-112 ఫిర్యాదుకు వెళ్లిన పోలీసుపై దాడి

- ప్రభుత్వ మొబైల్ ధ్వంసం,ఆర్ఎంపీ డాక్టర్ అరెస్ట్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 29 (విజయక్రాంతి):



డయల్112 ఫిర్యాదుపై విచారణకు వెళ్లిన పోలీసు సిబ్బందిపై ఓ ఆర్ఎంపీ డాక్టర్ దాడికి పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నానక్‌రామ్‌గూడలోని అపోలో ఆస్పత్రి వెనుక భాగంలో ఫిర్యాదుపై విచారణ చేపట్టిన హెడ్ కానిస్టేబుల్ టి. శివకుమార్‌పై సునీల్‌కుమార్ అనే వ్యక్తి దాడికి దిగాడు. పోలీసు సిబ్బంది వద్ద ఉన్న ప్రభుత్వ (టీజీ కాప్) మొబైల్ ఫోన్‌ను లాక్కొని రోడ్డుపై విసిరి ధ్వంసం చేయడంతో పాటు, ఆయన కాలర్ పట్టుకుని ముఖంపై పలుమార్లు కొట్టినట్లు పోలీసులు తెలిపారు.ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి సునీల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వరంగల్ పట్టణంలోని ఉషా క్లినిక్‌లో ఆర్ఎంపీగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ.5 వేల జరిమానా విధించిన సంగారెడ్డి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం

రామచంద్రాపురం,

సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ సంగారెడ్డిలోని ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది.2021లో రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, సంగారెడ్డి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం (పోక్సో) న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ కేసును విచారించి తీర్పు వెలువరించారు.సంబంధిత చట్టనిబంధనల ప్రకారం విధించిన శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సుర్‌రెడ్డి, దర్యాప్తు అధికారి కే. వెంకటేష్ (ఎస్సై), కోర్టు కానిస్టేబుల్ పి. తుకారామ్, సమన్స్ కానిస్టేబుల్ పి. అశోక్‌లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

పిఆర్సి నివేదికను తెప్పించి ఫిట్మెంట్ ప్రకటించాలి



- తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్.

మెదక్ సెప్టెంబర్,29(సిరి న్యూస్)

పిఆర్సి ప్రకటనను ప్రభుత్వమే వెంటనే ప్రకటించాలని తాపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్ అన్నారు.మంగళవారం పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్ లో జరిగిన గురుపందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్నటువంటి పిఆర్సి ప్రకటనను ప్రభుత్వమే వెంటనే ప్రకటించాలని,2003 డిఎస్సి ద్వారా నియమాకం కాబడిన ఉపాధ్యాయులతో సహా అందరికీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. 317 జీవో ద్వారా ప్రభావితమై దూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు స్వస్థలాలకి చేరుకునే విధంగా 190 జీవోను అమలుపరచాలని కోరారు.ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిని తగ్గిస్తూ ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి జీఓ నెంబర్ 25ని సవరించాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను అధికారికంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేస్తూ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్,రంగా రెడ్డి, జిల్లా బాధ్యులు మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మార్గం రాజు, బిక్షపతి, శశి కుమార్, వెంకటేశం, దత్తాతి, కృష్ణ, పోచయ్య,నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆదర్‌శ్‌రెడ్డి



పటాన్‌చెరు, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

పటాన్‌చెరు నియోజకవర్గ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ తండ్రి గడీల కుమార్ గౌడ్ ఇటీవల మృతి చెందడంతో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్‌శ్‌రెడ్డి, మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి ఇస్నాపూర్‌లోని శ్రీకాంత్ గౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమార్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమార్ గౌడ్ నివాసానికి వెళ్లి, ఇటీవల మృతి చెందిన ఆయన తండ్రి గడీల ఈశ్వరయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మెరాజ్ ఖాన్, శ్రీకాంత్ యాదవ్, కౌన్సిలర్లు వెంకటేష్, అంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, ముత్తంగి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సంపత్, బండ రాజు, జగన్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటన ఆలయాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ సహాయ కమిషనర్



శివంపేట్ సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)

సహాయ కమిషనర్ ఉమ్మడి మెదక్ జిల్లా విజయరామారావు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సికింద్లాపూర్ గ్రామము శివంపేట మండలము మెదక్ జిల్లా ను సందర్శించి దేవాలయ నిర్వహణ పై ఆదివారం రాత్రి జరిగిన దేవాలయంలో చోరీ సంఘటన పై శాఖపరమైన విచారణ చేసి సిబ్బందికి తగు సూచనలు చేసినారు. మెదక్ జిల్లా హుండీ పరిశీలకులు (ఇన్స్పెక్టర్)వి.రంగారావు సహాయకులు నరసింహా రెడ్డి ఆలయ అర్చకులు పాల్గొన్నారు

అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులకు ఇంటర్వ్యూలు

- నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి

శివంపేట్ సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)



మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎలిజిబుల్ లిస్టులను సంబంధిత గ్రామ పంచాయతీలలో ప్రదర్శించడంతో పాటు అభ్యర్థులకు సమాచారం అందించినట్లు నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి తెలిపారు.
ఎలిజిబుల్‌గా ఉన్న అభ్యర్థులకు కాల్ లెటర్లు కూడా అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎలిజిబుల్‌గా ఉన్న అంగన్వాడీ టీచర్ అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీన, అలాగే ఎలిజిబుల్‌గా ఉన్న అంగన్వాడీ ఆయా అభ్యర్థులకు అక్టోబర్ 1వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించబడతాయని, సంబంధిత ఎలిజిబుల్ అభ్యర్థులు తమకు అందిన కాల్ లెటర్లలో పేర్కొన్న సూచనల ప్రకారం నిర్ణీత తేదీన హాజరు కావాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



సదాశివపేట. సెప్టెంబర్ 29. (సిరిన్యూస్)

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో సైక్లింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శ్రీ బసవ సేవా సదన్ లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని జిల్లా ఎస్పీ పారితోజ్ పంకజ్ గారు సందర్శించి బాలాజీ హాస్పిటల్స్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ, కమిషనర్ శివాజీ , వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్లు, బాలాజీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ , ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మహేష్ , క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ , డాక్టర్ అక్బర్ , డాక్టర్ సందీప్ , డాక్టర్ శ్రీమన్నారాయణ , డాక్టర్ శంకర్ నారాయణ ,ఫిజిషియన్ డాక్టర్ అల్ఫియా రేచల్,బాలాజీ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణ సమస్యలకు టెక్ పరిష్కారాలు



- టి-వర్క్స్‌తో (సీఎంసీ) ఒప్పందం

శేరిలింగంపల్లి.సెప్టెంబర్ 29(సిరి న్యూస్):

పట్టణ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), టివర్క్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. టివర్క్స్‌ను సందర్శించిన సీఎంసీ కమిషనర్ శ్రీజన అక్కడి ప్రోటోటైపులు, వినూత్న ప్రాజెక్టులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలకు పరిష్కారాలను రూపొందించి, ప్రోటోటైపులుగా అభివృద్ధి చేసి పరీక్షించాలని నిర్ణయించారు.గుంతల మరమ్మతులు, స్ట్రీట్ ఫర్నిచర్, పబ్లిక్ యూరినల్స్, దోమల నియంత్రణ, పారిశుధ్యం, వాటర్ హయాసింత్ నిర్వహణ, అగ్నిప్రమాదాల నివారణ, రీసైక్లింగ్, ద్రవ వ్యర్థాల శుద్ధి తదితర అంశాల్లో కొత్త సాంకేతిక పరిష్కారాలపై దృష్టి పెట్టనున్నారు. కార్యక్రమంలో సీఎంసీకి చెందిన జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్, చీఫ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంసిద్ధం





- జిల్లాలో 518 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.
- గ్రేడ్ ఏ ధాన్యానికి - 2461,కామన్ రకానికి-2441.
- 07 రకాల సన్న వెరైటీ విత్తనాలకు
- 500 రూపాయల బోనస్.
- మిల్లర్ల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సవ్యంగా నిర్వహించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.

మెదక్ సెప్టెంబర్,29(సిరి న్యూస్)

ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం,జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి కాన్ఫరెన్స్ హాల్లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డీఆర్‌డీఓ, రవాణా, పోలీస్ శాఖల అధికారులతో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను సంసిద్ధంగా తయారు చేసినట్లు చెప్పారు. 202627 సంవత్సరానికి గాను జిల్లాలో 03 లక్షల 20వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేసినట్లు అంచనా వేసినట్లు వివరించారు. దొడ్డు రకం 413, సన్న రకం105 కేంద్రాలు మొత్తం 518 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేడ్ ఏ ధాన్యానికి2461, సాధారణ రకం2441 ధర నిర్ణయించినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఐకేపీ (ఐకేపీ),174, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం300 , సహకార మార్కెటింగ్ సొసైటీ 12 ,(ఎఫ్ పి ఓ) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ). ఆధ్వర్యంలో 32 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో ప్రోత్సాహం కోసం ఏడు ప్రాధాన్య వరి రకాలను గుర్తించామన్నారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048,హెచ్ ఎం టీ సోనా,జైశ్రీరామ్ , కెఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కెఎన్ఎం 7715. వివిధ రకాల సన్న రకం వడ్ల బోనస్ లను పొందుపరిచినట్లు తెలిపారు. టార్పాలిన్లు14353, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్06, తేమ కొలిచే యంత్రాలు655, అందుబాటులో ఉంచామన్నారు, గన్ని బ్యాగ్స్ 51 లక్షల 75000 ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు ప్రభుత్వాదేశాల మేరకు తీసుకునే విధంగా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదనంగా ఉన్న ప్యాడిని ఇంటర్మీడియట్ గోడౌన్లో స్టోరేజ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్నారు.ధాన్యం రవాణా చేసే లారీలకు నిబంధనల ప్రకారం ఖచ్చితంగా జీపీఎస్ (లేదా) వాహన స్థాన నిర్ధారణ వ్యవస్థను అమర్చాలని, తద్వారా ధాన్యం మళ్లింపును అరికట్టవచ్చని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ ,డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, సహకార శాఖ అధికారి పద్మ,లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్ ,రవాణా శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రూ .4 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం మంజూరు

- రంగంపేట సొసైటీలో మహా
- సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్
- రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుతాం

కొల్చారం. సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)




కొల్చారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని రైతులకు శుభవార్త అందిందని సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ తెలిపారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే రైతుల సౌలభ్యం కోసం సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మంగళవారం రంగంపేట సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ అధ్యక్షతన మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాలక మండలి డైరెక్టర్లు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. పూర్వీకుల సమయస్ఫూర్తితో సొసైటీకి స్థలం కేటాయించి ఉంచడం వల్ల 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరైందన్నారు. గోదాం నిర్మాణంతో రైతులకు మరింత ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఇకపై సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు,పురుగుమందులను రైతులకు అందుబాటులో ఉంచి వారి అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధురాలిని టార్గెట్ చేసిన దొంగ!

- 5.5 తులాల బంగారు గొలుసు చోరీ
- సీసీ కెమెరాల ఫుటేజీలపై పోలీసుల దృష్టి

శేరిలింగంపల్లి.సెప్టెంబర్ 29(సిరి న్యూస్):



చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుడా కాలనీలో ఉదయాన్నే చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. కాలనీకి చెందిన ఉమాదేవి (63) మంగళవారం ఉదయం 7.40 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ ఎదుట సీసీ రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా,ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమెను వెంబడించి ఒక్కసారిగా మెడలోని సుమారు 5.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.కాలనీల్లో నేరాల నియంత్రణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ సూచించారు. ఇళ్ల ముందు, వీధులు, ప్రధాన రహదారులను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా కాలనీల ప్రధాన కూడళ్లలో నాలుగు దిశలను కవర్ చేసే కెమెరాలు ఉంటే నేరాల సమయంలో కీలక ఆధారాలు లభించడంతో పాటు నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ పట్టాలు

- = ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం.
- = గత పాలకులు పేదలను పట్టించుకోలేదు.
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.

మెదక్ సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)



మెదక్ పట్టణంలో అర్హులైన పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 243 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ పట్టా సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో పేదలకు సరైన స్థాయిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికా భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, మన్సూర్, హరిత, కో ఆప్షన్ మెంబర్ తాహెర్ నాయకులు మైసన్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది పై కేసు నమోదు చేసిన పోలీసులు



తూప్రాన్ సెప్టెంబర్ 29 సిరి న్యూస్

తూప్రాన్ మండలం వెంకటయ్య పల్లి గ్రామానికి చెందిన 8 మంది పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన విషయం పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో సోమవారం రాత్రి డయల్100కు కాల్ రావడంతో సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డయల్100 కాల్‌కు స్పందించే క్రమంలో పోలీసులు వెళ్ళగా ఆ సమయంలో జంగం నవీన్ తొంట సతీష్ తొంట అనిల్ గోలిపల్లి వెంకట్ రెడ్డి గోలిపల్లి రాజారెడ్డి తొంట గణేష్ జంగం కిరణ్ బుర్ర వంశీగౌడ్ అనే ఎనిమిది మంది వ్యక్తులు మద్యం సేవించి పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు గుర్తించారు ఈ ఘటనపై తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం విధుల్లో ఉన్న సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించడం చట్ట పరమైన చర్యలకు దారితీస్తుందని విధి నిర్వహణ లో ఉన్న పోలీస్ అధికారులకు సహకరించాలని పోలీస్ పని చేసేది ప్రజల భద్రత కోసమేనని ఆపద సమయాలలో డయల్ 100 కు కాల్ వచ్చిందంటే స్పందించేది పోలీసులే కాబట్టి ప్రతి ఒక్కరు సహకరించాలని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు

ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

- **ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలి**
- **బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి**



గుమ్మడిదల, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

రాష్ట్ర ముఖ్యమంత్రి దేశ ప్రధానమంత్రి పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గుమ్మడిదల మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో గుమ్మడిదలలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రధానమంత్రి తోపాటు, హిందూ సమాజం పట్ల చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, దేశ ప్రధానిపై, హిందూ సమాజంపై మాట్లాడే సమయంలో బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని సూచించారు. ఇలాంటి వ్యాఖ్యలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శలు, సామాజిక వర్గాల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యల స్థాయికి తీసుకెళ్లకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కురు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాలేపల్లి రాజేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్, గుమ్మడిదల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నర్సపల్లి రాజిరెడ్డి, కొండా లక్ష్మణ్, కౌసర్, విజయలక్ష్మి, పరువు గోవర్ధన్ రెడ్డి, విజయ్, తాళ్ల నర్సింహ, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో బీజేపీ నేతల సేవా కార్యక్రమం



గుమ్మడిదల, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని సేవా ఆశ్రమంలో మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని సందర్శించిన నాయకులు అక్కడి వృద్ధులతో కొంతసేపు ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆయనను ఆశీర్వదించాలని వృద్ధులను కోరారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వృద్ధులు, నిరుపేదలు, అవసరమైన వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోణం విఠల్, జిల్లా ఇన్‌చార్జి రమణ్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కురు రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్, గుమ్మడిదల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నర్సపల్లి రాజిరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, బలేష్, గడ్డపోతారం మున్సిపల్ అధ్యక్షుడు మద్దూరి రాజు, అధ్యక్షుడు శివరాత్రి రాజు, మల్లేశం, బాగయ్య, ,పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు

- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**




గుమ్మడిదల, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి నిర్మాణం చేపట్టుకునేలా అవసరమైన నిధులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ అధికారులను ఆదేశించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ దశరథతో కలసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ పథకానికి దూరం కాకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పథకం అమలు తీరు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై అధికారులు, సిబ్బందితో చర్చించారు. ప్రధానంగా ఎల్ 1, ఎల్ 2 కేటగిరీలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను సమావేశంలో పరిశీలించారు. ఆయా జాబితాల్లోని లబ్ధిదారుల అర్హతలను పరిశీలిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని చైర్మన్ సూచించారు. అర్హత ఉన్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, నిర్మాణ పనులు ప్రారంభించుకునేలా అవసరమైన నిధుల మంజూరుకు సంబంధించిన చర్యలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చే అవకాశం లభిస్తున్నందున, లబ్ధిదారుల విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ప్రయోజనం అందేలా సమన్వయంతో పనిచేయాలని ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈ అనూషతో పాటు సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ-టీఎస్ గుమ్మడిదల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- **2026–28 కాలానికి అధ్యక్షుడిగా ఎన్. జనార్ధన్ రెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా పి. విజయ్ కుమార్**



గుమ్మడిదల, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

గుమ్మడిదల మండల పీఆర్‌టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలోని వర్తక సంఘం కార్యాలయంలో మండల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం. మాణయ్య, ఎన్నికల అధికారులు నరోత్తమ్, జనార్ధన్ గౌడ్ సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా ఎన్. జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి. విజయ్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎం. విశ్వనాథ్, అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా చిత్రప్రియ, ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా నిర్మల, కార్యదర్శిగా ఎం. మురళీ, మహిళా కార్యదర్శిగా పి. సునీతలను నూతన కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా జిల్లా అధ్యక్షులు మానయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘ సభ్యుల సహకారంతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల బాధ్యులు, జిల్లా బాధ్యులు, రాష్ట్ర బాధ్యులతో పాటు సంఘ ప్రాథమిక సభ్యులు హాజరయ్యారు.

"బీవీఆర్ఐటీలో విష్ణు జాతీయ స్థాయి సర్వేయింగ్ పోటీలు"

- **జాతీయ స్థాయిలో 27 ఇంజినీరింగ్ కళాశాలు సర్వేయింగ్‌లో ప్రాక్టికల్ నైపుణ్యాలకు ప్రాధాన్యం**
- **కర్నాటక , ఆంధ్రప్రదేశ్, తెలంగాణ**
- **56 విద్యార్థి బృందాలు**

నర్సాపూర్ సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)

బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్‌లో మంగళవారం జాతీయ స్థాయి సర్వేయింగ్ పోటీలు నిర్వహించారు రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 27 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 56 బృందాలు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలంగాణ నుంచి ఐఐటీ హైదరాబాద్ (IITH), CBIT, VNR తదితర ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన 15 ఇంజినీరింగ్ కళాశాలు, కర్ణాటక 04, ఆంధ్రప్రదేశ్ 08 ఇంజినీరింగ్ కళాశాలు పోటీలో పాల్గొంటున్నాయి. సర్వేయింగ్, ఫీల్డ్ మెజర్‌మెంట్స్, ఆధునిక సర్వేయింగ్ పద్ధతుల్లో విద్యార్థుల సాంకేతిక, ప్రాక్టికల్ నైపుణ్యాలను పరీక్షించడంతో పాటు, తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను వాస్తవిక పరిస్థితుల్లో అన్వయించుకునేలా ఈ పోటీని రూపొందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర రావు బలుసు" జాకబ్స్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సంస్థలో గ్లోబల్ సొల్యూషన్స్ డైరెక్టర్-హైవేస్ మాట్లాడుతూ, సర్వేయింగ్‌లో ఖచ్చితత్వం, నమ్మకం, బాధ్యత అత్యంత కీలకమని సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాథమిక సర్వేయింగ్ సూత్రాలపై బలమైన పట్టు సాధించాలని ప్రపంచవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిరతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో సివిల్ ఇంజినీరింగ్ రంగంలో డిజైన్, స్ట్రక్చరల్, పర్యావరణం, సస్టైనబిలిటీ తదితర విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతిగా లక్ష రూపాయలు ప్రశంసా పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల మేనేజర్ . బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు





తడి పొడి చెత్త బుట్టిలు, రేషన్ కార్డ్ పంపిణి



- **గ్రామపంచాయతీ పాలకవర్గం.!!**

శివంపేట సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)

శివ్వంపేట మండల కేంద్రంలోని తడిపొడి చెత్త బుట్టిలు మరియు రేషన్ కార్డు పంపిణి చేసిన సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ఉప సర్పంచ్ ఇసు గారి మల్లేశం మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు శివంపేట గ్రామ ప్రజలకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పసర్పంచ్ ఇసుగారి మలేష్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రమాదేవి,యాదగిరి,వార్డు సభ్యులు ముయ్యడి ముత్యాలు,పెద్దగోని శ్రీనివాస్, కొవ్వురి యాదగిరి,రెడ్డి పల్లి స్వరూప అశోక్, కొడకంచి గణేష్ గౌడ్, పెద్దకోలా విక్రమ్, కామల్యగారి మాళేశ్వరి నర్సింలు, ఈసారపు రాజు గౌడ్,కిషన్,గ్రామ శాఖ ముద్దగాళ్ల లక్ష్మి నర్సయ్య,మాజీ వార్డు సభ్యుడు వంజరి కొండల్,పెద్దలు,రామ గౌడ్,దొడ్ల అశోక్, గొట్టిముక్ల వెంకటేష్,ముయ్యడి నర్సింలు ,మ్యాస మహేష్,బసంపల్లి నర్సిములు,కమ్మరి ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

భర్త వైద్య ఖర్చుల కోసం.... హంతకురాలిగా భార్య

- **వృద్ధు రాలిని గొంతునులిమి హత్య**
- **పగిలిపోయిన గాజులతో దొరికిపోయిన నిందితురాలు**
- **జోగిపేట సీఐ అనీల్‌కుమార్**



జోగిపేట, సెప్టెంబర్ 29, (సిరి న్యూస్):

అనారోగ్యంతో బాధ పడుతున్న తన భర్తను కాపాడుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో దొంగతనాన్ని ఎంచుకొని జైలు పాలైన భార్య సంఘటన పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట లో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం జోగిపేట సీఐ కార్యాలయం లో సీఐ అనీల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ విశ్వజన్‌తో కలిసి వివరించారు. పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పట్నం నర్సమ్మ భర్త చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం అందించడానికి ఆర్థిక వనరులు లేకపోవడంతో గ్రామానికి చెందిన పోచమ్మ(70) హత్య చేయడానికి పూనుకుంది. ఈనెల 23వ తేదీ ఆర్ధరాత్రి నర్సమ్మ మృతురాలి ఇంటికి వెళ్లి పాత పరిచయంతోనే పేరు పెట్టి పిలవగా ఇంత రాత్రికి ఎందుకు వచ్చావ్ అని అపతలివైపు నుంచి వృద్ధురాలి అడుగగా, పని ఉందని చెప్పడంతో తలుపులు తీయగానే లోనికి ప్రవేశించి వృద్ధురాలి చీరను గొంతుకు గట్టిగా చుట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. మృతురాలి ఒంటి మీద ఉన్న తులంన్నర బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలను తీసుకువెళ్లింది. అయితే వీరి ద్దరి మధ్య కొంత పెనుగులాట జరగడంతో నర్సమ్మకు చెందిన గాజులు పగిలిపోయి సంఘటన స్థలంలోనే పడిపోయాయి. ఈ విషయాన్ని గుర్తించి ఈ హత్య మహిళయే చేసారని ఆ దిశగా విచారణ చేపట్టారు. దగ్గరలోని సీసీ పుటేజీలను పరిశీలించి అనుమానంతో నర్సమ్మను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన హత్యను ఒప్పుకుంది. మంగళవారం కోర్టుకు రిమాండ్ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సతీష్‌కు జిల్లా స్థాయిలో కీలక పదవి..

- **ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకం..**
- **బెల్లంపల్లిలో కాంగ్రెస్ శ్రేణుల హర్షం..**
- **పార్టీ బలోపేతం, ఎస్సీ సమస్యల పరిష్కారమే లక్ష్యం..**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)

కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేసేలా బెల్లంపల్లికి చెందిన కాంపెల్లి సతీష్‌కు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. టీపీసీసీ ఎస్సీ సెల్ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీగా సతీష్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల నర్సింగ్ సతీష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సతీష్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల నర్సింగ్‌కు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని సతీష్ స్పష్టం చేశారు. ఎస్సీ వర్గాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, హక్కులు, సమస్యలపై నిరంతరం పనిచేస్తానని తెలిపారు. సతీష్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడంపై బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళికలను సిద్ధం చేయాలి



- ట్రాన్స్‌కో-డిస్కంల సమన్వయంతో సమ్మర్ యాక్షన్ ప్లాన్
- అధిక లోడ్ నమోదవుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్ల గుర్తింపు
- సామర్థ్య పెంపు మరియు అదనపు పీటీఆర్‌ల ఏర్పాటు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):

భవిష్యత్ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళికలు సిద్ధం చేయాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీటీఐ కేంద్రంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన 'నెట్‌వర్క్ ప్లానింగ్ సమ్మర్ యాక్షన్ ప్లాన్'పై విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, రానున్న వేసవికాలంలో ఎల్ నినో ప్రభావం కారణంగా ఏర్పడే అదనపు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌కో డిస్కంలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పట్టణీకరణ, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, డేటా సెంటర్లు, ఐటీ పార్కులు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధితో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని సీఎండీ పేర్కొన్నారు. కేవలం ప్రస్తుత అవసరాలకే కాకుండా రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల భవిష్యత్ డిమాండ్‌ను అంచనా వేసి నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల వేసవిలో వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున, ప్రసార, పంపిణీ వ్యవస్థల్లోని బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మాధారంఘట్‌కేసర్, తిమ్మాపూర్‌కందుకూర్, ఎలిమినేడుఇబ్రహీంపట్నం, దండుమల్కాపూర్‌చౌటుప్పల్ తదితర పారిశ్రామిక కారిడార్లకు నిరంతర విద్యుత్ కోసం టీజీఐఐసీతో సమన్వయం చేసుకోవాలన్నారు. డేటా సెంటర్లు, ఐటీ పార్కులు, భారీ పరిశ్రమలకు అంతరాయం లేని విద్యుత్ కోసం డ్యూయల్ సోర్స్ వ్యవస్థను అమలు చేయాలిలని సూచించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక పురోగతికి బలమైన విద్యుత్ మౌలిక వసతులు కీలకమని పేర్కొన్న సీఎండీ జితేష్ వి. పాటిల్.. అధికారులు ముందస్తు సమన్వయంతో వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు చక్రపాణి (కమర్షియల్), డా. ఎన్. నరసింహులు (ఆపరేషన్స్), చీఫ్ ఇంజనీర్లు ప్రతిమా షోమ్, రవి కుమార్ మేకల, గోపయ్య, వెంకట రమేష్ పొత్తూరు, కరుణాకర్ బాబు, బాలస్వామి ఉబ్బాని, ఎస్ఈలు చంద్రశేఖర్, దిలీప్ కుమార్ తదితర సర్కిళ్ల ఎస్ఈలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ర్యాగింగ్ కలకలం

- సెకండ్ ఇయర్ విద్యార్థిపై దాడి
- విద్యార్థుల బైఠాయింపు
- ఇద్దరు సీనియర్లను సస్పెండ్ చేసిన యాజమాన్యం

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 :

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కాలేజీలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఈఈఈ సెకండ్ ఇయర్ చదువుతున్న రుత్విక్‌పై నలుగురు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. నిన్న క్యాంపస్‌లో రుత్విక్‌పై దాడి చేసి గొంతు పిసికినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధిత విద్యార్థి కాలేజీ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని తోటి విద్యార్థులు ఆరోపించారు. దీంతో సెకండ్ ఇయర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

రుత్విక్ తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు జాతీయ రహదారి 161పై బైఠాయించి నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనతో కాలేజీ యాజమాన్యం స్పందించింది. ఘటనపై విచారణ చేపట్టి, ర్యాగింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసింది. ఈ ఘటనతో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ర్యాగింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

100 రోజుల్లో 60 వేల మంది
విద్యార్థులకు పౌష్టికాహారం

- సయ్యద్ ముజావర్‌పేటలో ప్రపంచస్థాయి కేంద్రీకృత వంటశాల
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణ

సూర్యాపేట/హైదరాబాద్, ప్రజాతంత్ర, సెప్టెంబర్ 29 :

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు రోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం సయ్యద్ ముజావర్‌పేటలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాలను రాబోయే వంద రోజుల్లో అందుబాటులోకి తేవడానికి పనులు వేగవంతం చేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సామాజిక బాధ్యత కింద అందిస్తున్న రూ.9.60 కోట్ల ఆర్థిక సహాయంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ (అక్షయపాత్ర) సహకారంతో నిర్మిస్తున్నారు.

1,029 విద్యాసంస్థలకు సేవలు

ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని మొత్తం 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతి పనిదినం తాజాగా తయారుచేసిన సమతుల పౌష్టికాహారాన్ని అందిస్తారు. సూర్యాపేట జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, వేములపల్లి మండలాలకు చెందిన 131 ప్రభుత్వ విద్యాసంస్థల్లోని 7,972 మంది విద్యార్థులకు కూడా ఈ వంటశాల నుంచే ఆహారం సరఫరా కానుంది.

అధునాతన సాంకేతికత – నాణ్యమైన ఆహారం

ఒకేచోట భారీస్థాయిలో ఆహారాన్ని సిద్ధం చేయడంతోపాటు నాణ్యతా పరీక్షలు, ప్యాకింగ్, రవాణా, పంపిణీ వ్యవస్థలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించనున్నారు. ఆహార భద్రత, పరిశుభ్రత, నిర్ణీత సమయానికి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. విద్యార్థులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతోపాటు భారత చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సహాయంతో శాస్త్రీయంగా రూపొందించిన చిరు ధాన్యాల (మిల్లెట్స్) వంటకాలను మెనూలో చేర్చనున్నారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

- మోడీ కీలుబొమ్మగా ఈసీఐ
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

న్యూదిల్లీ, సెప్టెంబర్ 29 :

కేంద్ర ఎన్నికల కమిషన్ చైర్మన్ జ్ఞానేష్ కుమార్‌పై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతిలో ప్రధాన ఎన్నికల కమిషనర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని, ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యూ దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం మంగళవారం జరిగింది. ఈ భేటీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధ్యక్షత వహించారు. గతంలో రాజీవ్ గాంధీ పౌరులకు ఓటు హక్కు కల్పిస్తే నేడు ప్రధాని మోడీ 'ఓటు రద్దు' కుట్రలతో ఆ హక్కును లాక్కుంటున్నారని ఖర్గే విమర్శించారు. ప్రజాస్వామ్య పునాదులను, రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం క్రమబద్ధంగా ధ్వంసం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఈసీఐ తీరును తప్పుబడుతూ కాంగ్రెస్ ఐదు కీలక డిమాండ్లతో తీర్మానం ప్రవేశపెట్టింది. ఎన్నికల జాబితాలో చేసే మార్పులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని బహిర్గతం చేయాలని, అన్ని రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలను సకాలంలో అందజేయాలని తీర్మానం చేశారు. సీఈసీ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని సహ కమిషనర్లే పేర్కొన్న నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ సీఈసీ పదవిలో కొనసాగడానికి అనర్హుడని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణపై ప్రతిపక్షాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా తీర్మానించారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలపై పోరాటం

ఎన్నికల ప్రక్రియను నియంత్రించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సీడబ్ల్యూసీ తీర్మానించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ వెల్లడించారు. పార్టీ అంతర్గత వ్యవస్థ, రాబోయే రాజకీయ సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేష్ సహా పలువురు సీనియర్ నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతో భేటీ

సీడబ్ల్యూసీ సమావేశంతో పాటు ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విద్యాశాఖ మంత్రులతో ఖర్గే, రాహుల్ గాంధీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల్లో విద్యా విధానం అమలు, అక్షరాస్యత పెంపుదలపై సమీక్షించారు. సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితోపాటు కర్ణాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు డి.కె.శివకుమార్, వి.డి.సతీషన్, సుఖ్వీందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులపై కేంద్రం కీలక నిర్ణయం

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని 1.58 కోట్ల మంది గుర్తింపు
- అక్టోబర్ 1 నుంచి కార్డుల ప్రయోజనాలు తాత్కాలికంగా నిలిపివేత
- అర్హత నిరూపణకు మూడు నెలల గడువు
- ఈ-కేవైసీ, క్షేత్రస్థాయి పరిశీలనతో మళ్లీ యాక్టివేషన్
- డూప్లికేట్, అనర్హుల ఏరివేతే లక్ష్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో రేషన్ కార్డుల ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారుల కార్డులను అక్టోబర్ 1 నుంచి తాత్కాలికంగా డిసేబుల్ చేయనుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి సుమారు 1.58 కోట్ల మంది లబ్ధిదారుల రేషన్ ప్రయోజనాలు నిలిచిపోనున్నాయి. అయితే వారి పేర్లను వెంటనే డేటాబేస్ నుంచి తొలగించరు.

మూడు నెలల్లో ఈ-కేవైసీ

ఆరు నెలలుగా రేషన్ వినియోగించని కార్డులను 'సైలెంట్ రేషన్ కార్డులు'గా పరిగణించనున్నారు. తొలుత వాటిని తాత్కాలికంగా డిసేబుల్ చేసి, లబ్ధిదారులు తమ అర్హతను నిరూపించుకునేందుకు మూడు నెలల గడువు ఇవ్వనున్నారు. ఈ వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు ఈకేవైసీ పూర్తి చేస్తే కార్డును తిరిగి యాక్టివేట్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని అక్టోబర్ 1 నుంచి SMARTPDSలో అమలు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది.

డూప్లికేట్ల ఏరివేత

డూప్లికేట్ కార్డులు, మరణించిన వ్యక్తుల పేర్లు, వలస వెళ్లిన వారు, ఇతర అనర్హుల కారణంగా పీడీఎస్‌లో జరిగే లీకేజీలను అరికట్టడమే ఈ చర్యల ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, బయోమెట్రిక్ ధ్రువీకరణ, ఈకేవైసీ ద్వారా డేటాబేస్‌ను ప్రక్షాళన చేస్తోంది. 2024 నవంబర్ నాటికి డిజిటలైజేషన్, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ తదితర చర్యల ద్వారా సుమారు 5.8 కోట్ల రేషన్ కార్డులను పీడీఎస్ వ్యవస్థ నుంచి తొలగించినట్లు కేంద్ర ఆహార శాఖ తెలిపింది.

నిపుణుల అభ్యంతరం

అయితే రేషన్ తీసుకోకపోవడానికి కారణాలను ముందుగా పరిశీలించకుండా కార్డులను నిలిపివేయడం వల్ల నిజమైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన రాజేంద్రన్ నారాయణన్ అభిప్రాయపడ్డారు. సాంకేతిక సమస్యలు, వలసలు, రేషన్ డీలర్లతో ఇబ్బందుల కారణంగా కొందరు సరుకులు తీసుకోకపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుల అర్హతను క్షేత్రస్థాయిలో ముందుగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



సీఈసీపై సీజేపీ సమరం.. ముంబైలో 'జైల్ భరో'

- అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో నిరసనకు సీజేపీ పిలుపు
- అనుమతి నిరాకరించిన ముంబై పోలీసులు
- 'జైల్ భరో ఆందోళన'కు అభిజీత్ దీపే పిలుపు
- స్థానికుల అభ్యంతరాలతో మరింత ఉద్రిక్తత
- నిరసనకు అనుమతి లేదని పోలీసుల స్పష్టీకరణ

ముంబై, సెప్టెంబర్ 29:

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న ముంబైలో నిరసన చేపట్టాలని నిర్ణయించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కు పోలీసుల నుంచి అనుమతి లభించలేదు. శివాజీ పార్క్‌లో భారీ ఆందోళన నిర్వహించాలని సీజేపీ నిర్ణయించగా.. అక్కడ సభలకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదని ముంబై పోలీసులు స్పష్టం చేశారు. దీంతో సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీపే 'జైల్ భరో ఆందోళన'కు పిలుపునిచ్చారు.

స్థానికుల అభ్యంతరం

పోలీసుల అభ్యంతరాలతో పాటు శివాజీ పార్క్ పరిసరాల స్థానికుల నుంచి కూడా నిరసనకు వ్యతిరేకత వ్యక్తమైనట్లు సీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. సీజేపీ ప్రతినిధులు అక్కడికి చేరుకున్న సమయంలో కొందరు స్థానికులు కార్యక్రమాన్ని నిర్వహించొద్దని కోరిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే, వారు నిజంగా స్థానికులేనా? లేక ఉద్దేశపూర్వకంగా అక్కడికి పంపించారా? అని సీజేపీ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సీజేపీ, ముంబై బీజేపీ తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో పరస్పర భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించాయి.

పోలీసుల కారణాలివే..

శివాజీ పార్క్ నివాస ప్రాంతంలో, సైలెన్స్ జోన్‌లో ఉండటంతో పాటు అక్కడి వినియోగంపై బాంబే హైకోర్టు 2013లో ఇచ్చిన తీర్పు, మహారాష్ట్ర ప్రభుత్వం 2016లో జారీ చేసిన మార్గదర్శకాలను పోలీసులు ప్రస్తావించారు. నిరసనకు అవసరమైన బీఎంసీ అనుమతి కూడా సమర్పించలేదని పేర్కొన్నారు. శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ రద్దీతో పాటు సమీపంలోని ఆస్పత్రులకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మరో ప్రదేశంలో కార్యక్రమం నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. ఇదిలా ఉండగా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, ఎస్ఐఆర్‌ను నిలిపివేయడం, 2025 జనవరి ఓటరు జాబితాను పునరుద్ధరించడం తదితర డిమాండ్లను సీజేపీ ముందుకు తెచ్చింది. అక్టోబర్ 2న ముంబై నుంచి దేశవ్యాప్త ఆందోళన ప్రారంభిస్తామని గతంలో ప్రకటించిన సీజేపీ.. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో 'జైల్ భరో'కు పిలుపునిచ్చింది.



రూ.2,700 మందుకు రూ.27 వేలా?

- ఎంఆర్‌పీపై సుప్రీం ఆగ్రహం
- క్యాన్సర్ మందుల ధరలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల మందుల ధరల్లో భారీ వ్యత్యాసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఔషధ ధరల నియంత్రణకు సంబంధించిన పిటిషన్లను విచారిస్తూ.. రిటైలర్‌కు రూ.2,700కే లభించే క్యాన్సర్ మందుకు రూ.27 వేల ఎంఆర్‌పీ ఎలా ఉంటుందని ప్రశ్నించింది. ఇలాంటి ధరల వ్యత్యాసాన్ని 'దోపిడీ'గా అభివర్ణించింది. ఆసుపత్రుల ఫార్మసీలపైనా ప్రశ్నలు ప్రైవేటు ఆసుపత్రులు రోగులను తమ సొంత ఫార్మసీల నుంచే మందులు, వైద్య పరికరాలు కొనుగోలు చేయాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారన్న వాదనలపైనా ధర్మాసనం ఆరా తీసింది. ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద చికిత్స పొందే రోగుల మందుల బిల్లులు చివరకు ప్రభుత్వ ఖజానాపైనే పడతాయని, అలాంటి పరిస్థితుల్లో ధరల నియంత్రణ అవసరాన్ని పరిశీలించాలని పేర్కొంది. 16 శాతం మార్జిన్‌పై కేంద్రానికి సూచన ఔషధాలపై ఏకరీతి మార్జిన్ విధించే అంశాన్ని కేంద్రం పరిశీలించాలని ధర్మాసనం సూచించింది. అన్ని మందులకూ 16 శాతం మార్జిన్ వర్తింపజేయడం సాధ్యమా? అనే దానిపై ప్రభుత్వం ఆలోచించాలని కోరింది. అయితే ప్రస్తుత డీపీసీవో 2013 నిబంధనల్లో 16 శాతం మార్జిన్ అన్ని మందులకు వర్తించే సాధారణ పరిమితి కాదని స్పష్టత ఉంది. ఈ అంశంపై కేంద్రం సమగ్రంగా పరిశీలించనుంది. కేసు తదుపరి విచారణ అక్టోబర్ 12న జరగనుంది.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

బుధవారం
సెప్టెంబర్-30-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 271


పేజీలు : 5

దసరాలోపు డివిజన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి

- లేని పక్షంలో కొట్లట తప్పదు
- రామాయంపేట డివిజన్‌ను ఎందుకు కొనసాగించడం లేదు?
- కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనంతోనే డివిజన్ సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది
- మా హాయంలోనే రెవెన్యూ డివిజన్ తెచ్చాం
- దసరా తర్వాత మలి విడత ఉద్యమం
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

3





ఉద్రిక్తతకు దారి తీసిన యువకుడి ఆత్మహత్య!

పోలీసుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని బంధువుల ఆరోపణ

న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయింపు

ఆందోళనకు మద్దతుగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

3



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గూళ్ల శేఖర్ ఆత్మహత్య ఘటన జహీరాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. ఓ బంగారు ఆభరణాల చోరీ కేసు విచారణలో భాగంగా పోలీసులు శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారని, విచారణ పేరుతో పోలీసులు కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. శేఖర్ మృతితో బిలాల్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల వేధింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు జహీరాబాద్‌లో ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆందోళనకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

- జహీరాబాద్, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్)


కొత్తది నిర్మించారు పాతది వదిలేశారు!

కోట్లతో కొత్త ఆసుపత్రి.. కూల్చని పాత భవనం

- హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వింత పరిస్థితి
- కోట్లాది రూపాయల ప్రజాధనంతో కొత్త భవనం నిర్మాణం పూర్తి
- శిథిలావస్థలోనే దర్శనమిస్తున్న పాత ఆసుపత్రి భవనం
- తలుపులు, కిటికీలు ఊడదీసి ప్రమాదకరంగా వదిలేసిన వైనం

5





జేఎన్‌టీయూలో ర్యాగింగ్ కలకలం

- జూనియర్ విద్యార్థిపై సీనియర్ల దాడి
- మెడకు తీవ్రగాయం.., ఆసుపత్రికి తరలింపు
- ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థుల ఆగ్రహం
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- సీఐ, ప్రిన్సిపాల్‌లు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ
- ఇద్దరు సీనియర్ విద్యార్థుల సస్పెండ్

4





ర్యాగింగ్‌ను అరికట్టేందకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నా అక్కడక్కడ ఇంకా విద్యార్థులను వెంటాడుతూనే ఉంది. యూనివర్శిటీ స్థాయిలోనే ఈ మధ్య కాలంలో సీనియర్స్ జూనియర్స్‌ను ర్యాగింగ్ చేయడం అలవాటుగా మారిపోయింది. ర్యాగింగ్‌పై కఠిన చర్యలున్నప్పటికిని విద్యార్థుల్లో మార్పు రావడంలేదు. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాలలో సోమవారం ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుత్వీక్ అనే విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో జేఎన్‌టీయూ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న కార్తీక్, మహాదేవ్‌తేజ్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఒక దశలో ఆ విద్యార్థి గొంతు వద్ద ఏర్పడిన గాయం కారణంగా ఊపిరిపీల్చుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. వెంటనే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. - జోగిపేట, సెప్టెంబర్ 29, (సిరి న్యూస్):







ఉద్యోగం నుంచి ఉద్యమం వరకు!

ఇంతింతై అన్నట్లు జెల్ల సుధాకర్ సేవా ప్రస్థానం

- సామాజిక న్యాయం, ప్రజా ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం
- జహీరాబాద్ డీసీటీవోగా ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుధాకర్
- 1987లో కల్టేర్ రెవెన్యూ శాఖలో మొదలైన ఉద్యోగ ప్రయాణం
- 1993లో వాణిజ్య పన్నుల శాఖలోకి అడుగు.. డీసీటీవో స్థాయికి ఎదిగిన వైనం
- టీఎన్జీవో మెదక్ జిల్లా కార్యదర్శిగా ఉద్యోగుల హక్కులపై గళం
- తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో క్రియాశీలక పాత్ర
- తెలంగాణ జేఏసీ మెదక్ జిల్లా కన్వీనర్‌గా ప్రజా ఉద్యమాల సమన్వయం
- పాతికేళ్లుగా దళిత, బహుజన హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతర కృషి
- ఉద్యోగులకు, సమాజ సేవకులకు నిలువెత్తు స్ఫూర్తిగా సుధాకర్ జీవన గమనం

ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:
ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతమైన సేవ లందిస్తూనే.. మరోవైపు ఉద్యోగ హక్కుల పోరాటాలు, చారిత్రక తెలంగాణ మలిదశ ఉద్యమం, అణగారిన వర్గాల సామాజిక న్యాయ పోరాటాల్లో నిరంతరం ముందు వరుసలో నిలిచిన ప్రజానేత జెల్ల సుధాకర్. నాలుగు దశాబ్దాల క్రితం ఒక సాధారణ ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించి, నేడు జహీరాబాద్‌లో డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వ విధులకే పరిమితం కాకుండా ప్రజా క్షేత్రంలో అలుపెరగని ఉద్యమకారుడిగా, సామాజిక సేవకుడిగా ఆయన వేసిన ముద్ర విలక్షణమైనది.



రెవెన్యూ నుంచి వాణిజ్య పన్నుల శాఖ వరకు..

జెల్ల సుధాకర్ ఉద్యోగ ప్రస్థానం 1987 మే 2న నాటి కల్టేర్ రెవెన్యూ విభాగంలో ప్రారంభమైంది. అక్కడ తన విధులను సమర్థవంతంగా నిర్వహించిన అనంతరం, 1993లో సిద్దిపేటలోని కమర్షియల్ టాక్స్ శాఖలో టైపిస్టుగా బాధ్యతలు చేపట్టారు. విధి నిర్వహణలో నిబద్ధత, నిక్కచ్చిగా పనిచేసే తత్వంతో అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు గెజిటెడ్ అధికారి స్థాయికి చేరారు. శాఖాపరమైన విధుల్లో ఎక్కడా రాజీపడకుండా పనిచేస్తూనే, తన చుట్టూ ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గళమెత్తడం ఆయన ప్రత్యేకత.

ఉద్యమ సమరంలో టీజేఏసీ సారథి

ఉద్యోగ వర్గాల్లో సుధాకర్ నాయకత్వ లక్షణాలు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మెదక్ జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగుల సంక్షేమం, హక్కుల రక్షణ కోసం విశేషంగా శ్రమించారు. ఇక తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో ఏర్పాటైన తెలంగాణ రాజకీయ జాయింట్ యాక్షన్ కమిటీ మెదక్ జిల్లా కన్వీనర్‌గా అత్యంత బాధ్యతాయుతమైన పాత్ర పోషించారు. ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, సామాన్య ప్రజానీకాన్ని ఏకతాటిపైకి తెచ్చి మెదక్ గడ్డపై ధూంధాంలు, సహాయ నిరాకరణ, చారిత్రక సకల జనుల సమ్మె విజయవంతం కావడంలో కీలక సమన్వయకర్తగా వ్యవహరించారు.



దళిత, బహుజన విముక్తి కోసం అడుగులు

సుధాకర్ ప్రస్థానంలో మరో ఉజ్వలమైన కోణం ఆయన సామాజిక నిబద్ధత. గత 25 సంవత్సరాలుగా దళిత, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆయన నిరంతరం పనిచేస్తున్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు, సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడానికి దళిత సంఘాల వేదికలపై తన గళాన్ని బలంగా వినిపించారు. బడుగు వర్గాల విద్య, ఉపాధి, ఆత్మగౌరవ పోరాటాల్లో నిస్వార్థంగా భాగస్వామ్యమవుతూ ఎందరో యువకులకు మార్గదర్శిగా నిలిచారు.





నేటి తరానికి ఆదర్శ ప్రాయం

సమాజ సేవలో ముందుంటూనే తన కుటుంబాన్ని సైతం ఉన్నత విద్యా ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఆయన పెద్ద కుమారుడు జెల్ల హర్ష సాయి గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ లో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, కోడలు మనస్విని భాస్కర్ అంతర్జాతీయ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ లో ఎస్ పీఎస్ ఆపరేషన్స్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో కుమారుడు ఆధ్యాత్మిక్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. నిబద్ధత గల ప్రభుత్వ అధికారిగా, తెలంగాణ ఉద్యమ సారథిగా, పాతికేళ్ల పాటు సామాజిక న్యాయం కోసం నిలబడిన ఉద్యమకారుడిగా జెల్ల సుధాకర్ సాగించిన ఈ సుదీర్ఘ సేవా ప్రస్థానం నేటి యువ ఉద్యోగులకు, సమాజ శ్రేయోభిలాషులకు ఎంతగానో స్ఫూర్తిదాయకం.

ఉద్రిక్తతకు దారి తీసిన యువకుడి ఆత్మహత్య!

పోలీసుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని బంధువుల ఆరోపణ

- న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయింపు
- ఆందోళనకు మద్దతుగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గూళ్ల శేఖర్ ఆత్మహత్య ఘటన జహీరాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. ఓ బంగారు ఆభరణాల చోరీ కేసు విచారణలో భాగంగా పోలీసులు శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారని, విచారణ పేరుతో పోలీసులు కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. శేఖర్ మృతితో బిలాల్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల వేధింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు జహీరాబాద్‌లో ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆందోళనకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జహీరాబాద్, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్):



"అధికారమదంతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు"

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. పోలీసులు అతిగా వ్యవహరించడం మంచిది కాదు. శేఖర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం" అని అన్నారు. శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

పోలీసుల చర్యలపై విమర్శలు

చట్టాన్ని పరిరక్షిస్తూ సామాన్యుడికి న్యాయం చేయాల్సిన పోలీసులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించారని ఆరోపణలు రావడం శోచనీయం. జహీరాబాద్ ఎస్సై కఠినమైన చర్యలు తీసుకోవడం వల్లే బాధితుడు భయభ్రాంతులకు గురయ్యాడని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కొందరు పోలీసుల చర్యల వల్ల ఆ శాఖ అప్రతిష్ట పాలవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, ప్రజలు పోలీస్ స్టేషన్ ముందే ధర్నాలకు దిగడం ఆ శాఖ పనితీరుకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.





దసరాలోపు డివిజన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి

- లేని పక్షంలో కొట్లట తప్పదు
- రామాయంపేట డివిజన్‌ను ఎందుకు కొనసాగించడం లేదు?
- కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనంతోనే డివిజన్ సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది
- మా హాయంలోనే రెవెన్యూ డివిజన్ తెచ్చాం
- డివిజన్ వచ్చాక ఎందుకు కొనసాగించడం లేదు?
- దసరా తర్వాత మలి విడత ఉద్యమం.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

రామాయంపేట, సెప్టెంబర్ 29 (సిరి న్యూస్) రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కొనసాగించడం లేదని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రామాయంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామాయంపేట ప్రజల కోరిక మేరకు ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్‌ను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామాయంపేట ప్రజల కోరిక మేరకు అప్పటి మంత్రి హరీష్ దృష్టికి డివిజన్ ఏర్పాటు అంశాన్ని తీసుకెళ్లామని తెలిపారు. హరీశ్‌రావు ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. 2023 ఆగస్టులో మెదక్‌లో జరిగిన బహిరంగ సభలో రామాయంపేట రెవెన్యూ డివిజన్‌తో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటును కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. కేసీఆర్ డివిజన్ ఏర్పాటును ప్రకటించిన వెంటనే అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుతో కలిసి రామాయంపేట రెవెన్యూ డివిజన్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇన్‌చార్జి ఆర్డీఓను నియమించి ఆర్డీఓ కార్యాలయాన్ని కూడా ప్రారంభించామని చెప్పారు. అయితే మూడు నెలలకే ఇన్‌చార్జి ఆర్డీఓను తొలగించడంతో డివిజన్ కార్యకలాపాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. రామాయంపేటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పరిపాలనా సేవలు అందుబాటులో ఉండేందుకు రెవెన్యూ డివిజన్ కొనసాగింపు అవసరమని అన్నారు. రెవెన్యూ, పరిపాలనా పనుల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అవసరమైన సిబ్బందిని నియమించి ఆర్డీఓ కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామాయంపేట రెవెన్యూ డివిజన్ కొనసాగింపుపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన డివిజన్‌ను కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని పరిపాలనా సౌలభ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రామాయంపేట రెవెన్యూ డివిజన్ కొనసాగింపుపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి డివిజన్‌ను కొనసాగించేందుకు చర్యలు చేపట్టకపోతే దసరా తర్వాత మలి విడత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి,నాయకులు సుప్రభాతరావు,ఉమామహేశ్వర్, శ్రీకాంత్ సాగర్,అస్నుద్దీన్,దోమకొండ శ్రీను,గణపురం కృష్ణగౌడ్, రొయ్యల నవీన్, మద్దెల రమేష్, కన్నాపురం కృష్ణగౌడ్, పోచమ్మన ఐలయ్య, మార్కు దత్తు సాగర్, పుట్టి సిద్ధ రాములు, బసనపల్లి శ్రీనివాస్, కన్నాపురం సందీప్ తదితరులు పాల్గొన్నారు.









జేఎన్‌టీయూలో ర్యాగింగ్ కలకలం





- జూనియర్ విద్యార్థిపై సీనియర్ల దాడి
- మెడకు తీవ్రగాయం.., ఆసుపత్రికి తరలింపు
- ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థుల ఆగ్రహం
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- సీఐ, ప్రిన్సిపాల్‌లు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ
- ఇద్దరు సీనియర్ విద్యార్థుల సస్పెండ్

జోగిపేట, సెప్టెంబర్ 29, (సిరి న్యూస్): ర్యాగింగ్‌ను అరికట్టేందకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నా అక్కడ ఇంకా విద్యార్థులను వెంటాడుతూనే ఉంది. యూనివర్శిటీ స్థాయిలోనే ఈ మధ్య కాలంలో సీనియర్స్ జూనియర్స్‌ను ర్యాగింగ్ చేయడం అలవాటుగా మారిపోయింది. ర్యాగింగ్‌పై కఠిన చర్యలున్నప్పటికిని విద్యార్థుల్లో మార్పు రావడంలేదు. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీ యూ కళాశాలలో సోమవారం ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుత్వీక్ అనే విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో జేఎన్‌టీయూ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న కార్తీక్, మహాదేవ్‌తేజ్‌లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఒక దశలో ఆ విద్యార్థి గొంతు వద్ద ఏర్పడిన గాయం కారణంగా ఊపిరిపీల్చుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. వెంటనే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

ప్రిన్సిపాల్ పట్టించుకోలే...

ద్వితీయ సంవత్సరం విద్యార్థి రుత్విక్‌పై హత్యాయత్నం చేసే స్థాయిలో సీనియర్ విద్యార్థులు దాడికి పాల్పడినట్లు విద్యార్థులు జేఎన్‌టీయు ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రాజుకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, వారిని కనీసం మందలించే ప్రయత్నం చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. మంగళవారం భాదితుడి తల్లిదండ్రులు వచ్చి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. వారిపై చర్యలు తీసుకోవాలని, తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

రాస్తారోకోకు దిగిన విద్యార్థిని, విద్యార్థులు

విద్యార్థి రుత్విక్‌పై రాగింగ్ పేరుతో దాడి చేసినా ప్రిన్సిపాల్ పట్టించుకోనందుకు నిరసనగా మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నాందేడ్ అకోలా రహదారిపై ఆందోళనకు దిగాను. జోగిపేట-సంగారెడ్డి, హైద్రాబాద్ వెళ్లే దారిలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో చాలా సేపటి వరకు ప్రయాణీకులు నిరీక్షించాల్సి వచ్చింది. రుత్విక్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేసారు. ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా కూడా నినాదాలు చేసారు. విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనీల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ, పోలీసు సిబ్బందిచే జేఎన్‌టీయు వద్దకు చేరుకొని ఆందోళనను విరమింపజేసేందుకు చాలా సేపు శ్రమించాల్సి వచ్చింది. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు రాస్తారోకోను విరమించారు.

ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేసాం: ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌రాజు

విద్యార్థులు ఆందోళన చేపడుతున్నట్లు తెలుసుకొని గేట్ వద్దకు ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రాజు చేరుకున్నారు. విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసారు. వెంట తెచ్చుకున్న విద్యార్థుల సస్పెండ్ ఉత్తర్వు కాపీని చదివి వినిపించారు. సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించి విచారణ జరిపించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థిపై కార్తీక్, మహాదేవ్ తేజ్‌లు దాడికి పాల్పడినట్లుగా తేలడంతో వెంటనే ఆ ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకటించారు. వీరిద్దరూ క్యాంపస్‌లో జరిగే ఏ కార్యక్రమాలకు హజరు కాకపోవడంతో పాటు తరగతులకు కూడా రాకూడదని ఆయన స్పష్టం చేసారు. తదుపరి ఉత్తర్వుల వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

సస్పెండ్ చేస్తే మళ్లీ వస్తారు...

దాడి చేసిన విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రాజు ప్రకటించినా విద్యార్థులు సంతృప్తి చెందకపోగా తీవ్ర అభ్యంతరం తెలిపారు. సస్పెండ్ చేస్తే వారు తిరిగి కొన్ని రోజుల తర్వాత మళ్లీ వస్తారని, వారిని పూర్తిగా రాకుండా నిషేదించాలని పట్టుబట్టారు. అందుకు ప్రిన్సిపాల్ సమాధానం ఇస్తూ సంఘటన విషయమై పూర్తి స్థాయిలో నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలుంటాయని, ఒకేసారి వారిని పూర్తి స్థాయిలో నిషేదించలేమని, దానికి కొన్ని నిబంధనలున్నాయని ప్రిన్సిపాల్ స్పష్టం చేసారు.

కేసులు నమోదు కాలేదు...

జెన్‌టీయూ కళాశాలలో రుత్విక్ అనే విద్యార్థిపై ఇద్దరు సీనియర్ విద్యార్థులు దాడికి పాల్పడినదానికి సంబంధించి ఎలాంటి కేసులు నమోదు కాలేదని పుల్కల్ ఎస్ఐ 'సిరి'కి తెలియజేసారు. ఇరు వర్గాలకు చెందిన వారు సామరస్యపూర్వకంగా చర్చలు జరుపుకొని కేసులు పెట్టుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదని ఎస్ఐ విశ్వజన్ స్పష్టం చేసారు.











కొత్తది నిర్మించారు పాతది వదిలేశారు!

కోట్లతో కొత్త ఆసుపత్రి.. కూల్చని పాత భవనం

- హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వింత పరిస్థితి
- కోట్లాది రూపాయల ప్రజాధనంతో కొత్త భవనం నిర్మాణం పూర్తి
- శిథిలావస్థలోనే దర్శనమిస్తున్న పాత ఆసుపత్రి భవనం
- తలుపులు, కిటికీలు ఊడదీసి ప్రమాదకరంగా వదిలేసిన వైనం
- ఆసుపత్రి చుట్టూ పిచ్చిమొక్కలు, విషపురుగుల సంచారం
- పాములు, కోతులకు నిలయంగా మారిన పాత భవనం
- మంత్రి దామోదర ఆదేశించినా కదలని అధికారులు
- డీఎంహెచ్ఓ, పీఆర్ ఏఈ, ఎంఈఓ తనిఖీలు చేసినా కానరాని పురోగతి

(మహమ్మద్ జావేద్)
(హత్నూర, సిరి న్యూస్):
సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం రోగుల ప్రాణాల మీదకు తెస్తోంది. ప్రజాధనంతో కోట్ల రూపాయలు వెచ్చించి సకల హంగులతో నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ.. దాని ముందే ఉన్న ప్రమాదకర పాత భవనాన్ని ఇప్పటికీ కూల్చివేత చేయకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభమై రోగులు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో వస్తున్నప్పటికీ, సరిగ్గా ప్రవేశ ద్వారం ముందే శిథిలావస్థకు చేరిన పాత భవనం యమపాశంలా వేలాడుతోంది.

పాములు, కోతులకు స్థావరం

పాత భవనంలోని తలుపులు, కిటికీలను ఎప్పుడో తొలగించి కేవలం పెచ్చులు ఊడుతున్న పెళుసు గోడలు, పైకప్పును అలాగే వదిలేశారు. ఆసుపత్రి ప్రాంగణమంతా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు, దట్టమైన గడ్డి ఏపుగా పెరిగిపోయింది. దీంతో ఈ శిథిల కట్టడం విష కీటకాలు, పాములు, తేళ్లకు సురక్షిత స్థావరంగా మారింది. మరోవైపు కోతుల గుంపులు ఈ శిథిల గోడలపై తిష్టవేసి ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులపై దాడులకు తెగబడుతున్నాయి. వర్షాకాలం కావడంతో పాత గోడలు పూర్తిగా నీటితో నానిపోయి, ఏ క్షణాన ఎవరి నెత్తిన కూలిపడుతుందోనని రోగులు భయంతో వణికిపోతున్నారు.

ఆరోగ్యశాఖ మంత్రే ఆదేశించినా..

నూతన ఆసుపత్రి భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఆ సందర్భంలో మంత్రి స్వయంగా పరిశీలించి, కొత్త ఆసుపత్రి ప్రాంగణం ముందు నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న పాత భవనాన్ని వెంటనే డిస్మెంట్ల చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే మంత్రి చెప్పిన ఆదేశాలను సైతం స్థానిక అధికారులు బుట్టదాఖలు చేయడం వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

మాటలకే పరిమితమైన అధికారుల హామీలు..

గతంలో ఈ ప్రమాదకర పరిస్థితిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పుడు అధికార యంత్రాంగం కొంత హడావుడి చేసింది. ఎంఈఓ, పంచాయతీరాజ్ ఏఈ అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి త్వరలోనే కూల్చివేతలు చేపడతామని ప్రగల్భాలు పలికారు. ఆ తర్వాత జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సైతం సందర్శించి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ నెలలు, ఏళ్లు గడుస్తున్నా ఆ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అధికారుల స్పందన కేవలం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తక్షణమే పార్కింగ్ స్థలంగా మార్చాలి

పెను ప్రమాదం జరిగి నిండు ప్రాణాలు గాల్లో కలవకముందే జిల్లా యంత్రాంగం నిద్రమత్తు వీడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న పాత ఆసుపత్రి భవనాన్ని తక్షణమే ప్రొక్లెయినర్లతో కూల్చివేసి ఆ స్థలాన్ని శుభ్రం చేయాలి. అక్కడ పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను తొలగించి, రోగుల వాహనాల పార్కింగ్ స్థలంగా లేదా రోగుల బంధువులు వేచి ఉండే షెల్టర్‌గా అభివృద్ధి చేస్తే ఆసుపత్రికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని హత్నూర మండల ప్రజలు కోరుతున్నారు.